

# జై భీమ్

తెలుగు దినపత్రిక
POWER OF PEOPLE


సమస్యలపై సమరంగా
Jai Bheem TV
STRUGGLE FOR JUSTICE
సామాన్యుడి ఆయుధంగా




సంపుటి - 06 | సంచిక 164 | ఎడిటర్ : బరిగెల శివ | ఆదివారం 11, మే 2025 | పేజీలు 8 | వెల రూ. 5


పబ్లిషర్స్ తెలంగాణ : హైదరాబాద్, ఆంధ్రప్రదేశ్ : విజయవాడ, ఢిల్లీ, కర్ణాటక, బెంగళూరు, తమిళనాడు, చెన్నై, మహారాష్ట్ర, ముంబై, గోవా, కేరళ, ఉత్తరప్రదేశ్, పజాబ్, పశ్చిమబెంగాల్, అమెరికా, లండన్, ఆస్ట్రేలియా, దుబాయ్, మస్కట్

# అసత్య ప్రచారాలు అంతరించబడాలి









అల్ప సంతోషాల కోసం నిజాలను అబద్ధాలుగా మారుస్తున్నారు

సత్యాన్ని సత్యమని చెప్పడానికి కొండంత ధైర్యం కావాలి

రాజకీయ నాయకుల గొప్పల కోసం అబద్ధాలు ప్రచారం చేయిస్తున్నారు


కాలానుకూలంగా నిజాయితీని కొనసాగించాలి

తప్పుడు ప్రచారాలకు తావివ్వకండి

ప్రభుత్వాలు వివరాలు ఇస్తున్నప్పటికిని అసత్య ప్రచారాలు ఆగడంలేదు

మానవత్వాన్ని కాపాడాల్సిన వాళ్లు మానవ మృగాలను తయారు చేస్తున్నారు

నిజం కనుమరుగైతే సమాజం అంతరిస్తుంది : డాక్టర్ బరిగెల శివ






డాక్టర్ బరిగెల శివ
జై భీమ్ సంస్థల ఫౌండర్, చైర్మన్

**హైదరాబాద్ (జై భీమ్ డెస్క్)**

నిజం మరుగునపడి అసత్యమనేది అంతట అతి వేగంగా ప్రచారం కొనసాగించబడుతుందని డాక్టర్,బరిగెల శివ తెలుపుతూ సమాజం ఆలోచింపజేయాలని సూచించారు. తప్పుడు ప్రచారాలను జనం నమ్ముతూ సత్యమైన ప్రచారాలను పక్కన పెడుతున్నారన్నారు. ముఖ్యంగా భారత్ పాక్ పరస్పరదాడుల సమయంలో లక్షల అసత్య ప్రచారాలను మాధ్యమాల్లో చూడడం జరిగిందన్నారు. సోషల్ మీడియాలో నైతే దుష్ప్రచారాలకు లెక్కే లేదన్నారు. కాలానుకూలంగా నిజాయితీని ప్రచురిస్తూ ప్రజలను ప్రభావితం చేయాలన్నారు. ఆలోచనయుక్తమైన నిజాలు సమాజానికి చేరవేయబడటంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రేరేపిత అసత్య ప్రచారాలు,వార్తలుగా మలుచబడి ఆకాశాన్ని

- మిగతా 2లో..



# దెబ్బకు దిమ్మతిరిగిన పాక్

నడ్డివిరిగి నిలబడలేని దుస్థితి

ఉగ్రదాడిని యుద్ధ చర్యగానే పరిగణిస్తామని భారత్ హెచ్చరిక

భారత్ హెచ్చరికలతో బెంబేలెత్తిన పాక్ పాలకులు

కాల్పుల విరమణకు అమెరికాతో మధ్యవర్తిత్వం

భారత్ దెబ్బకు పాక్ ఎయిర్ బేస్‌లన్నీ ధ్వంసం

యుద్ధం చేయడానికి సత్తా..సత్తువ లేకుండా చేసిన భారత్

చేసేది లేక కాళ్లబేరానికి వచ్చిన పాక్ పాలకులు

పరిమిత దాడులతో సైనికి శక్తిని చాటిన భారత్

అమెరికా అధ్యక్షుడు ట్రంప్ విజ్ఞప్తిని అంగీకరించిన భారత్

ఇరు దేశాలు కాల్పుల విరమణకు అంగీకారం

2



## కాల్పుల విరమణకు ఇరు దేశాలు అంగీకరించాయి

రాత్రంతా వారితో చర్చలు జరిపి ఒప్పించారు
సోషల్ మీడియాలో ట్రంప్ పోస్ట్

**వాషింగ్టన్,మే10(జై భీమ్ న్యూస్):**

భారత్- పాకిస్థాన్‌లు కాల్పుల విరమణకు అంగీకరించాయని, ఇందుకు అమెరికా మధ్యవర్తిత్వం వహించిందని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించారు. ఈ మేరకు తన ట్రూత్‌సోషల్‌లో శనివారం సాయంత్రం ఓ పోస్ట్ పెట్టారు. అమెరికా మధ్యవర్తిత్వంలో రాత్రంతా సుదీర్ఘంగా చర్చలు జరిగాయి. తక్షణమే కాల్పుల విరమణ చేపట్టేందుకు భారత్, పాక్ అంగీరించాయి. సరైన సమయంలో ఇరు దేశాలు విజ్ఞతతో, తెలివిగా వ్యవహరించాయి. అందుకు ధన్యవాదాలని ట్రంప్ తన పోస్ట్‌లో పేర్కొన్నారు. ఈ విషయాన్ని భారత్, పాక్ వేర్వేరు ప్రకటనల్లో ధ్రువీకరించాయి. ట్రంప్ పోస్ట్ చేసిన కాసేపటికే అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రుబియో సైతం ఇదే తరహా ప్రకటన చేశారు. భారత్, పాక్ మధ్య కాల్పుల విరమణ ఒప్పందం కుదిరిందని పేర్కొన్నారు. భారత్, పాక్ ప్రధానులు నరేంద్రమోదీ, షెహబాజ్ షరీఫ్, భారత విదేశాంగ శాఖ మంత్రి జైశంకర్, పాక్ చీఫ్ ఆఫ్ ఆర్మీ స్టాఫ్ అసిమ్ మునీర్, ఇరు దేశాల జాతీయ భద్రతా సలహాదారులు అజిత్ డోభాల్, అసిమ్ మాలిక్‌లతో మాట్లాడినట్లు-చెప్పారు. తాను, అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ ఇందుకు సంబంధించిన చర్చల్లో పాల్గొన్నామని పేర్కొన్నారు.

## నా సిందూరాన్ని దేశ రక్షణకు పంపుతున్నా

జవాన్ భార్య ధీరత్వం

**ముంబై,మే10(జై భీమ్ న్యూస్):**

'నా సిందూరాన్ని దేశ రక్షణ కోసం పంపుతున్నా' అంటూ నవ వధువు పెళ్లయిన మూడు రోజులకే భర్తను సరిహద్దుల్లోకి పంపి ఆదర్శంగా నిలుస్తోంది. ఇందుకు గర్విస్తున్నాని తెలిపింది. దేశం కన్నా తనకు మరేదీ ముఖ్యం కాదని తెలిపి ధీరత్వాన్ని చాటింది. భారత్-పాక్ మధ్య ఉద్రిక్తతల దృష్ట్యా పారా మిలిటరీ బలగాలకు సెలవులు రద్దయిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో మహారాష్ట్రకు చెందిన జవాను మనోజ్ పాటిల్‌కు.. బోర్డర్‌కు తిరిగి రావాలని ఉన్నతాధికారుల నుంచి సమాచారం అందింది. అయితే మనోజ్‌కి ఈనెల 5నే వివాహం జరిగింది. పెళ్లయి వారం రోజులు కూడా గడవకముందే విధుల్లో చేరాల్సి రావడంతో భార్య యామిని, కుటు-ంబ సభ్యులు బాధను దిగమింగుకొని మనోజ్‌ను దేశ రక్షణ కోసం పంపారు. ప్రస్తుతం ఇందుకు సంబంధించిన వీడియో వైరల్ అవుతోంది.అలాగే ఆమెను అంతా అభినందించారు.




## భారత్ దాడిలో పాక్ ఎయిర్ బేస్‌లు ధ్వంసం




కోలుకోలేని దెబ్బ కొట్టిన రక్షణ దళాలు

దేశం కోసం భారత్ బలగాలు ఎప్పుడూ సిద్ధమే

దేశ సార్వభౌమత్వానికి సవాల్ విసిరితే సహించేది లేదు

రక్షణశాఖ ప్రతినిధులు స్పష్టీకరణ

2

## కాల్పుల విరమణ ఉల్లంఘనలో పాక్ రికార్డు

ఏనాడూ ఒప్పందాలను పట్టించుకోని దాయాది

ఉగ్రమూకలను ఉసిగొల్పుతూ..

దాడులకు పాల్పడే నైజం

తాజా కాల్పుల విరమణకు కట్టుబడి ఉంటుందా అన్నదీ అనుమానమే

2

## కాశ్మీర్ ప్రజలకు అండగాఉంటాం

మృతుల కుటుంబాలకు పదిలక్షల పరిహారం

కాశ్మీర్ సిఎం ఒమర్ అబ్దుల్లా వెల్లడి

2



జై భీమ్ తెలుగు దినపత్రిక POWER OF PEOPLE
Jai Bheem TV STRUGGLE FOR JUSTICE సామాన్యుడి ఆయుధంగా

# అసత్య ప్రచారాలు అంతరించబడాలి

మొదటి పేజీ తరువాయి

చేరుతున్నాయన్నారు. కల్పిత ప్రచారాలకు కళ్లెం వేయబడకపోతే ప్రస్తుతకాలంలో నిజాయితీ అనేది ప్రజలకు చేరువఅయ్యే ఆస్కారమే లేదన్నారు. సమాజం అసత్యాన్ని అనుసరిస్తుందా నిజం వైపు నడుస్తుందా ఎటు తేల్చుకోలేకపోతుందన్నారు. నిజాలు ప్రచారం చేస్తే దాడులు జరుగుతున్నాయని బలమైన విశ్వాసంతో చెప్పారు. ప్రజల మధ్య రాగద్వేషాలు, అల్లర్లు, గొడవలు సృష్టించబడడానికి ప్రధాన కారణాలు అసత్య ప్రచారలేనన్నారు. అంతరించిపోతున్న మానవ విలువలను ప్రభుత్వాలు కాపాడలేకపోతున్నాయన్నారు. కొన్ని ప్రభుత్వాలు వీలైనంత మంచి చేసిన వాటన్నిటిని వక్రీకరిస్తూ ఎక్కువ సంఖ్యలో అసత్యంగా ప్రచారాలు కొనసాగిస్తున్నారన్నారు. తప్పును తప్పు నిజాయితీని నిజాయితీ అని మాట్లాడే సాహసవంతులు కరువైపోతున్నారన్నారు. ఎక్కువ శాతం ప్రభుత్వాలు ప్రజా వ్యతిరేక విధానాలను అవలంబించి తలపెడుతున్నప్పుడు ఆయా ప్రభుత్వాల కార్యకర్తలు వాటన్నిటిని గొప్పగా చెప్పుకుంటున్నారన్నారు. రాజకీయ నాయకుల స్వార్థ ప్రయోజనాల కోసం ప్రజల జీవితాలను ప్రజాసేవను వాళ్ల .....వాళ్ల,రాజకీయాలకు వాడుకుంటున్నారన్నారు. నాయకులు ప్రజాసేవను నాశనం చేస్తున్నప్పటికిని గుడ్డిగా నమ్మాల్సిందేనా అంటూ ప్రశ్నించారు. దేశవ్యాప్తంగా ప్రజాస్వామ్యానికి తూట్లు పొడుస్తున్న ప్రభుత్వాలే చలామణి కొనసాగిస్తున్నాయన్నారు. పగలు ప్రతికారాలకు నాయకుల ముఖకవళికలే కారణమన్నారు. ప్రజా సేవలో నమ్మించి మోసం చేయడానికి ఎక్కువ ప్రాధాన్యతనిస్తున్నారు తప్ప ఇచ్చిన మాట కోసం నిలబడి ప్రజల పక్షాన నిలబడుతున్న నాయకులు చాలా తక్కువైపోయారన్నారు. మానవత్వం కోసం పరితపించాల్సిన నాయకులు మానవ మృగాలను తయారు చేస్తున్నారన్నారు. స్వార్థపూరిత రాజకీయాలను పెంపొందించడం కోసం పార్టీలు మారిన ద్వితీయ శ్రేణి నాయకులకు పెద్దపీట వేస్తున్నారన్నారు. జాతీయ మీడియాలు మొదలుకొని రాష్ట్రస్థాయి మీడియాలు నాయకుల స్వార్థ ప్రయోజనాలను ప్రజా స్వప్రయోజనాలుగా సమాజంలోనికి వదిలేస్తున్నారన్నారు. కొద్దో గొప్పో మంచి చేస్తున్న నాయకుల పట్ల కూడా విషపూరితమైనటువంటి అసత్య ప్రచారాలే కొనసాగిస్తున్నారన్నారు. సోషల్ మీడియా ఆగడాలతో ప్రజాస్వామ్యం ఎటువైపు నడుస్తుందో తెలియక ప్రజలు అయోమయంలో పడిపోతున్నారన్నారు. ప్రభుత్వాల పనితీరును అగమ్య గోచరంగా మారుస్తున్నది ముమ్మాటికి అసత్య ప్రచారాలేనన్నారు. దైవ సన్నిధిలో ప్రమాణాలు చేయడం, రాజ్యాంగ నిర్మాణంపై ప్రమాణాలు చేయడం, ప్రజాస్వామ్య విలువలపై ప్రమాణాలు చేయడం, ప్రజలకు మేలు చేస్తామని ప్రమాణాలు చేయడం, రాజకీయ నాయకులకు సునాయసమైన అలవాటైపోయిందన్నారు. సాధారణమైన నాయకులే వందల వేల కోట్లకు పరిగెడుతుంటే నీతి నియమాలు నిజాయితీ నిబద్ధతలు మాని ప్రభుత్వంలో కొనసాగుతున్న ఉన్నతమైన నాయకుల ఆస్తుల వివరాలైతే లెక్క కట్టడానికి ఊహకందదన్నారు. నేటి వరకు కొనసాగించబడిన భారత్..... పాక్..... పరస్పరదాడులలో భారత ఆర్మీ అధికారులు దాడులకు సంబంధించిన వివరాలను, విజువల్స్ ను ప్రత్యక్షంగా పత్రిక సమావేశాలు నిర్వహిస్తూ ఇప్పటికప్పుడు వివరాలు వెల్లడిస్తున్నప్పటికిని వాటన్నిటికీ పూర్తి విరుద్ధంగా ఉదేశపూర్వకంగా అసత్య ప్రచారాలను ప్రచురిస్తూ ,ప్రచారం చేస్తూ, ప్రజలను పూర్తిగా తప్పుతూ పట్టించారన్నారు, జరుగనటువంటి సన్నివేశాలను సైతం ప్రచారాలలో కొనసాగిస్తూ పబ్బం గడుపుకున్నారన్నారు. కొన్ని రాష్ట్రాలలోనైతే ఆయా ప్రభుత్వాలు ముఖ్యమంత్రులు, హెూం శాఖ మంత్రులు, ప్రత్యేకించి ప్రభుత్వ పోలీస్ బలగాలతో యుద్ధ వాతావరణం తలపిస్తున్న విధివిధానాలను ఎప్పటికప్పుడు ప్రజలకు చేరవేయడానికి కమాండ్ కంట్రోల్ రూమ్స్ ఏర్పాటు చేసుకొని వాటి ద్వారా ఆయా రాష్ట్రాల రక్షణ కోసం ప్రధాన నగరాల్లో ప్రధాన ప్రాంతాల్లో (జంగు) శబ్ద సైరన్స్ ఏర్పాటు చేశారన్నారు. ప్రతిరోజు యుద్ధ ప్రాతిపదికన పోరాటాల వివరాలను ఆయా రాష్ట్రాల కంమాండ్ కంట్రోల్ రూమ్స్ ఎప్పటికప్పుడు ప్రభుత్వాలకు చేరవేయడమే కాకుండా పత్రికా ప్రకటనలు విడుదల చేస్తున్నప్పటికీ కొన్ని రాష్ట్రాల్లో నైతే వాటికి భిన్నంగా దుష్ప్రచారాలు సాగాయన్నారు. అన్ని రాష్ట్రాల కన్నా తెలంగాణ రాష్ట్రం భారత్, పాక్ యుద్ధం పట్ల నిజమైన సమాచారాన్ని రాష్ట్ర ప్రజలకు దేశ ప్రజలకు ప్రపంచంలోని ప్రతి తెలుగు ప్రజలకు చేరవేసిందన్నారు. భారతదేశంలో అతిపెద్ద రెండవ ప్రధాన నగరమైన హైదరాబాదులో అనేక అల్లర్లు గొడవలు దాడులు సృష్టించబడతాయని అసత్య ప్రచారాలు అంచనా వేసినప్పటికిని, అదే భారతదేశంలో రెండవ ప్రమాదకరమైన నగరమైన ఇదే హైదరాబాదులో ఎక్కువ శాతం ముస్లిం సామాజిక వర్గంతో నిండి ఉన్నప్పటికీ స్వల్ప దాడులకు కూడా తావు లేకుండా నిశ్శబ్దమైన,ప్రశాంతమైన వాతావరణాన్ని కల్పించడంలో ఇటు ప్రభుత్వం అటు ముస్లిం సోదరులు పూర్తి ఐకమత్యాన్ని చాటి చెప్పారన్నారు. భయంకరమైన విధ్వంసాలు జరుగుతాయని భావించిన హైదరాబాదులో చిన్న గొడవలకు కూడా తావు లేకుండా ప్రజలకు భద్రత కల్పించడంలో తెలంగాణ ప్రభుత్వం పూర్తిగా సఫలీకృతమైందన్నారు. ముఖ్యంగా ప్రజాస్వామ్య అనుకూలమైన విలువలను అసత్యాలుగా ప్రజాస్వామ్య వ్యతిరేక విలువలను సత్యాలుగా ప్రచారం చేయడంలో అత్యంత ఉత్సాహాన్ని ప్రదర్శిస్తున్న ప్రధాన మీడియా ప్రతిపక్ష మీడియా సోషల్ మీడియా అదుపుతప్పిందన్నారు. నిజమైన సమాచారాన్ని ప్రచారం చేయడంలో సమాజవంతమైన ప్రజాస్వామ్యాన్ని నిర్మించుకోగలమని విశ్వసించారు. కీడును మేలుగా మేలును కీడుగా ప్రచారం చేసే దుస్థితిలు పూర్తిగా అంతరించి వేయబడాలన్నారు. ప్రజల బాగు కొరకు ప్రజాస్వామ్య రక్షణ కొరకు నిజాలనే ప్రచురిద్దాం నిజాయితీనే ప్రదర్శిద్దామంటూ ప్రజాస్వామ్య సమాజానికి పిలుపునిచ్చారు. దాడుల వేటలో దాగి ఉన్న స్వార్థం నిర్మూలించబడాలన్నారు. ప్రజలకు మేలు చేస్తున్నప్పుడు ప్రజాస్వామ్యాన్ని రక్షిస్తున్నప్పుడు ఎన్ని అసత్య ప్రచారాలు ఎన్ని తప్పుడు ఆరోపణలు ఎన్ని మానసిక దాడులు సంభవించబడుతున్నప్పటికిని ప్రకృతి, కాలం,భగవత్ స్వరూపం, తప్పకుండా సహకరించి ఆదుకుంటాయని బలమైన విశ్వాసాన్ని ప్రకటించారు. కర్మఫలం ఎవరిని అంత సునాయాసంగా వదిలిపెట్టదని మానవ జీవితంలో ఏదైతే తలపెడతామో దాన్ని తప్పకుండా తిరిగి పొందుకోగలమని తెలిపారు. ప్రజాసేవలో నమ్మకద్రోహం ప్రాణద్రోహం లాంటిదని ప్రజల్ని నమ్మించి మోసగించడం ఒక రకంగా చెప్పాలంటే ప్రజల ప్రాణాలతో చెలగాటమాడడమేనన్నారు. రాజకీయ నాయకులు నిజాయితీ కలిగిన పరిపాలనను అందించడం కోసం పరితపించాలన్నారు.

# దెబ్బకు దిమ్మతిరిగిన పాక్

**నడ్డివిరిగి నిలబడలేని దుస్థితి**
**ఉగ్రదాడిని యుద్ధ చర్యగానే పరిగణిస్తామని భారత్ హెచ్చరిక**
**భారత్ హెచ్చరికలతో బెంబేలెత్తిన పాక్ పాలకులు**
**కాల్పుల విరమణకు అమెరికాతో మధ్యవర్తిత్వం**
**భారత్ దెబ్బకు పాక్ ఎయిర్ బేస్‌లన్నీ ధ్వంసం**
**యుద్ధం చేయడానికి సత్తా..సత్తువ లేకుండా చేసిన భారత్**
**చేసేది లేక కాళ్లబేరానికి వచ్చిన పాక్ పాలకులు**
**పరిమిత దాడులతో సైనికి శక్తిని చాటిన భారత్**
**అమెరికా అధ్యక్షుడు ట్రంప్ విజ్ఞప్తిని అంగీకరించిన భారత్**
**ఇరు దేశాలు కాల్పుల విరమణకు అంగీకారం**

**న్యూఢిల్లీ,మే10(జై భీమ్ న్యూస్) :**

దెబ్బకు దిమ్మ తిరిగింది. నడ్డి విరిగి..నడవలేని పరిస్థితుల్లో పాకిస్తాప్ కాళ్లబేరానికి వచ్చింది. నేరుగా భారత్ కాళ్లనే పట్టుకున్నా...కాదనడంతో అమెరికాను ఆశ్రయించింది. చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్‌తో చెప్పించింది.ఐదు రోజుల్లోనే పాక్ ఇక ముందుకు అడుగు వేయలేని దుస్థితికి చేరింది. భారత రక్షణ దళాల దెబ్బకు పాక్ కోలుకోలేని దెబ్బతింది. ఇక యుద్ధంకాదుకదా...భారత సైన్యం ముందు నిలబడలేని దుస్థితికి వచ్చింది. ఈ క్రమంలో యుద్ధం వద్దంటూ కాళ్లావేళ్లా పడింది. మరోవైపు ప్రతీ ఉగ్రదాడిని యుద్ధచర్యగానే పరిగణిస్తామని శనివారం భారత్ చేసిన ప్రటకనతో వణికిపోయింది. మరోవైపు బలూచీస్థాన్ స్వతంత్రం ప్రకటించకుంది. ఈ క్రమంలో భారత్‌తో తలపడలేని పరిస్థితిలో చేతులెత్తేసింది. ఇప్పటికే చేయాల్సిన నష్టం చేసిన భారత్ కూడా ...కాల్పుల విరమణకు సరేనంది. అయితే..షరతలు వర్తిస్తాయని తేల్చిచెప్పేసింది. ఈ క్రమంలో విదేశాంగ మంత్రి జై శంకర్ కాల్పుల విరమణ ప్రకటిస్తూ ట్వీట్ చేశారు. మొత్తంగా పహల్గామ్ ఊచకోత తరవాత..పివోకెలో ఉగ్ర శిబిరాలపై దాడితో పాక్ దిమ్మతిరిగి మైండ్ బ్లాక్ అయ్యింది. తామేమీ తక్కువ తినలేదని బీరాలకు పోయి యుద్ధానికి కాలు దువ్వింది. గత బుధవారం భారత్ ఉగ్రశిబిరాలను ధ్వంసం చేయగానే ..పాక్ యుద్ధానికే దిగింది. దీంతో భారత్ తన దెబ్బ ఎలావుంటుందో రుచి చూపింది. ఈ దెబ్బకే దిమ్మతిరిగిన పాక్ చేతులెత్తేసింది. ఇప్పటికే అక్కడి ఎంపిలు పాక్‌ను దమ్మెత్తి పోశారు. యుద్ధం చేయలేమని హెచ్చరించారు. వినకుండా ఆర్మీ చీఫ్ మునీర్ ఒత్తిడితో కాలుదువ్వి...కాళ్లు విరగొట్టుకుంది. మొత్తంగా గత కొన్ని రోజులుగా భారత్–పాక్ మధ్య కొనసాగుతున్న ఉద్రిక్తతలకు తెరపడింది. కాల్పుల విరమణకు ఇరు దేశాలు అంగీకరించినట్లు భారత విదేశాంగశాఖ ప్రకటించింది. శనివారం సాయంత్రం 5గంటల నుంచి ఇవి అమల్లోకి వచ్చినట్లు తెలిపింది. అంతకుముందు ఇదే అంశంపై స్పందించిన అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్.. భారత్– పాక్‌లు కాల్పుల విరమణకు అంగీకరించాయని, ఇందుకు అమెరికా మధ్యవర్తిత్వం వహించిందని ప్రకటించారు. శనివారం సాయంత్రం భారత విదేశాంగశాఖ ప్రతినిధి విక్రమ్ మిస్రీ మాట్లాడుతూ.. మధ్యాహ్నం 3.35 గంటలకు ఇరుదేశాల డైరెక్టర్ జనరల్ ఆఫ్ మిలటరీ ఆపరేషన్స్ స్థాయిలో ఇరుదేశాల మధ్య చర్చలు జరిగాయి. పాకిస్థాన్ డీజీఎంఓ భారత డీజీఎంవోకు ఫోన్ చేశారు. కాల్పుల విరమణకు ఇరు దేశాల సైనికాధికారులు అంగీకరించారు. సాయంత్రం 5గంటల నుంచి ఇది అమల్లోకి వచ్చింది. భూ, గగన, సముద్రతలాల నుంచి ఇరు దేశాల మధ్య కాల్పుల విరమణ కొనసాగుతుంది. వీటికి సంబంధించి ఇరుదేశాల సైన్యానికి తగిన ఆదేశాలు వెళ్లాయి. ఈ నెల 12న సాయంత్రం డీజీఎంవోలు మళ్లీ చర్చలు జరుపుతారని విదేశాంగ మంత్రి విక్రమ్ మిస్రీ వెల్లడిం చారు. ఇరు దేశాల మధ్య కుదిరిన కాల్పుల విరమణపై విదేశాంగశాఖ మంత్రి ఎస్ జైశంకర్ ఎక్స్ వేదికగా స్పందించారు. కాల్పుల విరమణ, సైనిక చర్యలను నిలిపివేయడంపై భారత్, పాక్ ఈ రోజు ఓ అవగాహనకు వచ్చాయన్నారు. ఉగ్రవాదం విషయంలో మాత్రం భారత్ తన రాజీలేని వైఖరిని కొనసాగి స్తుందని పేర్కొన్నారు. పహల్గాం ఉగ్రదాడితో కయ్యానికి కాలుదువ్విన పాకిస్తాన్ ఇప్పుడు భారత్ కన్నెర్ర చేయడంతో దిగ్గుతోచని పరిస్థితుల్లో పడింది. ఓవైపు ఆర్థిక వ్యవస్థ కుదేలయ్యిందంటూ ప్రపంచ దేశాల ముంగిట రుణాల కోసం వెంపర్లాడుతూ, ఉద్రిక్తతలు తగ్గించేందుకు ముందుగా భారత్ చొరవ తీసుకోవా లంటూ మేకపోతు గాంభీర్యం ప్రదర్శిస్తోంది. మరోవైపు, సొంత పౌరుల ప్రాణాలు బలపెట్టేందుకు నిస్సిగ్గుగా సిద్ధమవుతోంది. పాకిస్తాన్ దాడుల విషయంలో కేవలం ప్రతిసారీ మౌనంతో సాధ్యపడదని భారత్ ఇటీవల దాడులతో నిరూపించింది. ఈ క్రమంలోనే భారత్, పాకిస్తాన్ మధ్య ఉద్రిక్తతలు తీవ్ర స్థాయికి చేరుకున్నాయి. భారత్, తన శక్తిని మౌనంగా చూపించకుండా, స్పష్టంగా వ్యూహాత్మకంగా పాకిస్తాన్ దురుద్దేశాలకు గట్టి కౌంటర్ ఇచ్చింది. ఈ ప్రతిస్పందనతో పాక్ చివరికి వెనక్కి తగ్గింది. అమెరికా మధ్యవర్తిత్వంతో, కాల్పుల విరమణ ఒప్పందానికి భారత్ అంగీకరించింది. ఈ నేపథ్యంలో శనివారం సాయంత్రం ఈ పరిస్థితులకు ముగింపు లభించింది. అయితే శాంతి అంటే బలహీనత మాత్రమే కాదు. అది సమర్థత, స్థిరత్వం, దేశ ప్రజల పట్ల నిబద్ధత గురించి ఆలోచించి తీసుకున్న నిర్ణయమని చెప్పవచ్చు. ఈ పరిణామం శాంతిని నిలుపు కోవడంతోపాటు సైనిక శక్తి ఎలా ఉపయోగిస్తుందో భారత్ మరోసారి పాకిస్తాన్ సహా అనేక దేశాలకు చూపించింది. ఈ క్రమంలో ఇరు దేశాల ప్రజల ప్రాణాల గురించి ఆలోచించిన భారత్ చివరకు శాంతి విధానానికి సమ్మతించింది. భారత్‌పై ఇటీవల పలు వివాదాస్పద వ్యాఖ్యలు చేసిన ఆ దేశ రక్షణ శాఖ మంత్రి ఖవాజా ఆసిఫ్ తాజాగా మరోసారి తన నీచ బుద్ధిని, చేతకానితనాన్ని చాటుకున్నారు. ఇందుకు నిస్సిగ్గుగా పార్లమెంటును వేదికగా చేసుకున్నారు. అత్యవసర పరిస్థితులు తలెత్తితే మదర్సాలలో చదువుకునే విద్యార్థులను రెండవ రక్షణ కవచంగా ఉపయోగిస్తామని ఖవాజా ఆసిఫ్ పార్లమెంటులో ప్రకటించారు. అయితే భారతదేశం ప్రతీకార చర్యతో పాకిస్థాన్ పూర్తిగా భయపడింది. మధ్యవర్తిత్వం కోసం అమెరికాను ఆశ్రయించింది. అమెరికా భారత్– పాక్ మధ్య మధ్యవర్తిత్వం వహించింది. పాకిస్థాన్ కాల్పుల విరమణకు అంగీకరించింది. భారత్–పాకిస్తాన్ యుద్ధంపై అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ సంచలన ప్రకటన చేశారు.. కాల్పుల విరమణకు భారత్–పాక్ అంగీకరించాయి.. భారత్–పాకిస్థాన్ మధ్య మధ్యవర్తిత్వం వహించాం.. రాత్రంతా భారత్–పాకిస్థాన్‌లతో చర్చలు జరిగాయి.. రెండు దేశాలకు నా అభినందనలు.. తక్షణమే కాల్పుల విరమణకు ఇరు దేశాలు అంగీకరించాయని ట్రంప్ పేర్కొన్నారు. అయితే పాక్ గతచరిత్ర చూస్తే ఏనాడు కాల్పుల విరమణను పాటించలేదు. ఇప్పుడు ఎలా అంగీకరిస్తారన్నది చూడాలి.



# కాల్పుల విరమణ ఉల్లంఘనలో పాక్ రికార్డు

**ఏనాడూ ఒప్పందాలను పట్టించుకోని దాయాది**
**ఉగ్రమూకలను ఉసిగొల్పుతూ...దాడులకు పాల్పడే నైజం**
**తాజా కాల్పుల విరమణకు కట్టుబడి ఉంటుందా అన్నదీ అనుమానమే**

**న్యూఢిల్లీ,మే10(జై భీమ్ న్యూస్):**

పాక్ ఎప్పుడూ నమ్మదగిన శత్రువు కాదు. నిరంతరంగా పక్కలో బల్లెంలానే వ్యవహరించింది. అనేక యుద్ధాల్లో ఓడినా దానికి బుద్ధి రాలేదు. ఎప్పుడూ కయ్యానికి కాలు దువ్వడం అలవాటు చేసుకుంది. ఉగ్రవాదులను పెంచి పోషించి, భారత్‌లో మారణహోమం సృష్టించడం ఆనవాయితీగా పెట్టుకుంది. అయితే పహల్గామ్ ఊచకోత తరవాత భారత్ గట్టిగా సమాధానం ఇవ్వడంతో దెబ్బకు దయ్యం వదిలింది. అయితే ఉగ్రమూకలను పోషించకుండా పాక్ ఉంటుందా..అక్కడి సైన్యం ఉండనిస్తుందా అన్నదే సమస్య. అయితే ఏ మాత్రం ఉగ్రచర్యలకు దిగినా భారత్ మరోమారు సైనిక చర్యకు దిగడం ఖాయం. ఇదిపాక్‌కు కూడా తెలుసు. కాల్పుల విరమణలో ఇది ప్రధాన అంశం కానుంది. నిజానికి దీనిని పూర్తిస్థాయి యుద్ధానికి తీసుకుని వెళ్లి పాక్ భరతం పట్టాలని ప్రధాని మోడీ గట్టి పట్టుదలతో ఉన్నా అంతర్జాతీయంగా వచ్చి ఒత్తిళ్లకు తలొగ్గక తప్పలేదు. ఇకముందు కాశ్మీర్ లేదా భారత్‌లో ఎలాంటి ఉగ్ర చర్యలు జరిగినా అందుకు పాక్ భారీ మూల్యం చెల్లించుకోక తప్పదు. ఇకపోతే కాల్పుల విరమణ జరిగినా భారత్ తీసుకున్న అష్టదిగ్బంధన చర్యలు మాత్రం యధావిధిగా కొనసాగే అవకాశం ఉంది. అందులో సింధూజలాల ఒప్పందం రద్దు, సిమ్లా ఒప్పందం రద్దు వంటివి ఉన్నాయి. భారత్, పాక్‌ల మధ్య1980 నుంచి ఉద్రిక్తతలు మొదలయ్యాయి. కాగా.. 2010 నుంచి 2020 సెప్టెంబర్ వరకు దాదాపు 11,572 సార్లు పాకిస్థాన్ సరిహద్దుల్లో శాంతి ఒప్పందాన్ని ఉల్లంఘించింది. ఈ ఘటనల్లో దాదాపు 240 మంది భారతీయలు చనిపోయారు. 673 మంది పౌరులు, 594 మంది సైనికులు గాయపడ్డారు. 1972లో నియంత్రణ రేఖను నిర్ధరించిన అనంతరం సరిహద్దుల్లో దాదాపు 10ఏళ్ల పాటు– ఎటువంటి ఉద్రిక్తతలు జరగలేదు. 1980 నుంచి యుద్ధ ట్యాంకులతో గస్తీ జోరందుకోగా.. 1990లో కశ్మీర్ లో తిరుగుబాటు తారాస్థాయికి చేరుకునే నాటికి ఇరుదేశాలు పూర్తి బలగాలను మొహరించాయి. 2001లో భారత్ తన సరిహద్దు ప్రాంతంలో కంచె నిర్మించడం ప్రారంభించిన తర్వాత నియంత్రణ రేఖ వద్ద కాల్పులు తీవ్రతరం అయ్యాయి. 2003 తర్వాత ఇరుదేశాలు యుద్ధ ట్యాంకులను దాదాపు 5 ఏళ్లపాటు నిషేధించాయి. ఈ దేశాల మధ్య ఆ సమయంలో జరిగిన చర్చలు మంచి ఫలితాలను ఇచ్చాయి. అయితే ముంబయిలో 2008 ఉగ్రదాడుల తర్వాత శాంతి చర్చలకు తావు లేకుండా పోయాయి. క్రమంగా సరిహద్దుల్లో యుద్ధట్యాంకుల అలజడి పెరిగింది. 2013లో అంతర్జాతీయ సరిహద్దు, నియంత్రణ రేఖ వద్ద ఉల్లంఘనలు ఎక్కువయ్యాయి. ప్రతి ఏడాది అవి గణనీయంగా పెరుగుతున్నాయి. 2017లో భారత్ 1,970 సార్లు ఉల్లంఘనలకు పాల్పడిందని పాకిస్థాన్ ఆరోపించింది. 2018లో పాకిస్థాన్ 936 సార్లు కాల్పుల విరమణ ఒప్పందానికి తూట్లు– పొడిచిందని భారత్ ఆరోపించింది. ఆనాటికి 15 ఏళ్లలోనే ఆల్ టైమ్ రికార్డది. 2018 మే నెలలో జమ్ముకశ్మీర్ లో.. భారత్ నాన్ ఇనీషియేషన్ ఆఫ్ కాంబాట్ ఆపరేషన్లను ప్రకటించింది. దీన్నే రంజాన్ కాల్పుల విరమణ అంటారు. ఇది 2003లో జరిగిన కాల్పుల విరమణ ఒప్పందానికి కొనసాగింపు. అయితే కాలక్రమేణ ఇరుదేశాల మధ్య సత్సంబంధాలు దెబ్బతిని.. 2019, 2020లో ఉద్రిక్తతలు తారాస్థాయికి చేరాయి. అఇప్పటి నుంచి కూడా 2025 వరకు పాకిస్థాన్ వరుసగా కాల్పుల విరమణను ఉల్లంఘిస్తూ వస్తోంది. తాజాగా సరిహద్దుల్లో కాల్పుల విరమణ ఒప్పందాన్ని ఉల్లంఘించి పౌరులపై కాల్పులకు తెగించింది. దీంతో ఇద్దరు జవాన్లు, 22మంది సామన్య పౌరులు మృతి చెందారు. ఈ క్రమంలో అమెరికా మధ్యవర్తిత్వంలో ఈ ఒప్పందం ఎంతవరకు ఫలిస్తుందో చూడాలి.

## భారత్ దాడిలో పాక్ ఎయిర్ బేస్‌లు ధ్వంసం

**న్యూఢిల్లీ,మే10(జై భీమ్ న్యూస్):**

దేశ రక్షణ కోసం భారత సైనయం ఎల్లవేళలా సిద్దంగా ఉంటుందని రక్షణశాఖ ప్రతినిధులు స్పష్టం చేశారు. దేశ సార్వభౌమత్వాన్ని కాపాడడంలో ముందుంటామని అన్నారు. కొన్ని రోజులుగా భారత్, పాక్‌ల మధ్య నెలకొన్న ఉద్రిక్తతలకు తెరపడింది. కాల్పుల విరమణకు అంగీకరించినట్లు ఇరుదేశాల విదేశాంగ శాఖలు ప్రకటించాయి. ఈ ప్రకటన అనంతరం భారత సైనికాధికారులు మీడియాతో మాట్లాడుతూ కీలక వ్యాఖ్యలు చేశారు. భారత్‌పై పాక్ అసత్యాలు ప్రచారం చేస్తోందన్నారు. కాల్పుల విరమణ ఒప్పందానికి కట్టుబడి ఉంటామని, అయినప్పటికీ భారత సైన్యం ఎల్లప్పుడూ అప్రమత్తంగా ఉంటుందని వెల్లడించారు. భవిష్యత్తులో పాకిస్థాన్ దాడులకు తెగబడితే దీటుగా సమాధానమిస్తామని స్పష్టం చేశారు. భారత్‌పై కవ్వింపు చర్యలకు దిగి పాక్ తీవ్రంగా నష్టపోయిందని ఇండియన్ ఆర్మీ తెలిపింది. భారత్–పాకిస్తాన్ కాల్పుల విరమణ ప్రకటన తర్వాత శనివారం విలేకరుల సమావేశంలో కల్నల్ సోఫియా ఖురేషి మాట్లాడుతూ.. భారత్ రా–400తోపాటు– బ్రహ్మోస్ క్షిపణి స్థావరాలను పాకిస్తాన్ వైమానిక దళానికి చెందిన ఓఎ–17 నాశనం చేసిందంటూ పాకిస్తాన్ తప్పుడు ప్రచారం చేసిందన్నారు. ఊా–400 సేఫ్ అని.. భారత ఆర్మీకి ఎలాంటి నష్టం జరగలేదని తెలిపారు.భారత సాయుధ దళాలు పాకిస్తాన్‌లోని ప్రార్థనా స్థలాలను భారత్ టార్గెట్ చేయలేదని చెప్పారు. సిర్సా, జమ్మూ, పఠాన్‌కోట్, భటిండా, నలియా, భుజ్‌లోని మన వైమానిక స్థావరాలు దెబ్బతిన్నాయని పాకిస్తాన్ అసత్య ప్రచారం చేసిందని పేర్కొన్నారు. పాకిస్తాన్ ఆర్మీ బేస్‌లను, ఎయిర్ డిఫెన్స్ సిస్టమ్‌ను భారత సైన్యం ధ్వంసం చేసిందని చెప్పారు. ఇక పాకిస్తాన్ ఎలాంటి కవ్వింపు చర్యలకు దిగినా దీటుగా జవాబిస్తామని సోఫియా ఖురేషి హెచ్చరించారు. కొన్ని రోజులుగా భారత్‌పై పాక్ అవాస్తవాలు ప్రచారం చేస్తోంది. ఎస్–400, బ్రహ్మోస్ వ్యవస్థలపై వాళ్లు దాడి చేశారనడం అవాస్తవం. సిర్సా, జమ్మూ, బఠిండా, భుజ్‌లపై దాడి పాక్ దాడి చేశామని ప్రచారం చేసింది. అది కూడా అబద్ధం. నలియా, పఠాన్‌కోట్ వాయుసేన స్థావరాలకు నష్టం కలిగించామని, చండీగఢ్ ఆయుధాగారంపై దాడి చేసినట్లు– పాక్ తప్పుడు ప్రకటనలు చేసింది. ప్రార్థనా మందిరాలపై భారత్ దాడి చేసిందని అంటోంది. భారత్ లౌకిక దేశం.. ప్రార్థనా మందిరాలపై ఎప్పుడూ దాడి చేయదు.

## కాశ్మీర్ ప్రజలకు అండగాఉంటాం

**మృతుల కుటుంబాలకు పదిలక్షల పరిహారం**
**కాశ్మీర్ సిఎం ఒమర్ అబ్దుల్లా వెల్లడి**

**శ్రీనగర్,మే10(జై భీమ్ న్యూస్):**

గత రెండు రోజుల నుంచి జమ్మూకశ్మీర్ సరిహద్దు ప్రాంతాలపై పాక్ జరుపుతున్న దాడుల్లో దాదాపు 20మంది పౌరులు మృతి చెందిన విషయం తెలిసిందే. మృతుల కుటుంబాలకు జమ్మూ కశ్మీర్ ప్రభుత్వం తరఫున ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా నష్టపరిహారం ప్రకటించారు. మృతుల కుటుంబాలకు రూ.10 లక్షల చొప్పున పరిహారం అందిస్తామని తెలిపారు. బాధిత కుటుంబాలకు తమ ప్రభుత్వం ఎప్పటికీ మద్దతుగా నిలుస్తుందని హామీ ఇచ్చారు. పహల్గాం దాడికి ప్రతీకారంగా ఉగ్రస్థావరాలను భారత్ ధ్వంసం చేయడంతో.. పాక్ కూడా సరిహద్దు ప్రాంతాల్లో ప్రతీకార దాడులకు పాల్పడుతోంది. నియంత్రణ రేఖ వెంట పాక్ కాల్పుల విరమణ ఒప్పందాన్ని ఉల్లంఘించి దాడులకు తెగబడుతోంది. కశ్మీర్‌లోని శ్రీనగర్, రాజౌరి, పూంఛ్, పఠాన్ కోట్ ప్రాంతాల్లో పాక్ డ్రోన్‌లతో దాడులు చేస్తోంది. ఈ దాడుల్లో జమ్మూకశ్మీర్ ప్రభుత్వ అధికారి రాజ్‌కుమార్ థప్పా సహా దాదాపు 20మంది పౌరులు ప్రాణాలు కోల్పోగా..పదుల సంఖ్యలో గాయపడ్డారు. పౌరులు, ప్రభుత్వ ఉన్నతాధికారి మృతి పట్ల జమ్మూకశ్మీర్ ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా ఆవేదన వ్యక్తం చేశారు. ఒక్కరోజు ముందే తాను అధ్యక్షత వహించిన ఆన్‌లైన్ సమావేశంలో రాజ్‌కుమార్ పాల్గొన్నారని.. ఇంతలోనే రాజౌరిలోని ఆయన ఇంటిపై జరిగిన దాడిలో ప్రాణాలు కోల్పోవడం బాధాకరమని అన్నారు. శనివారం వేకువజామున కూడా భారత్‌పై పాకిస్థాన్ సైన్యం దాడులకు పాల్పడింది. రాత్రి నుంచే సరిహద్దు రాష్ట్రాల్లో కొన్నిచోట్ల బాంబుపేలుళ్లు వినిపించడంతో అధికారులు అప్పటికప్పుడు విద్యుత్తు సరఫరా నిలిపివేసి 'బ్లాకౌట్' పాటించారు. శ్రీనగర్, పఠాన్ కోట్ ప్రాంతాల్లో ఉదయం కూడా పేలుళ్ల శబ్దాలు వచ్చినట్లు– స్థానికులు పేర్కొన్నారు. కాగా పాక్ దాడులను భారత్ సమర్థంగా తిప్పికొట్టింది. సరిహద్దు ప్రాంతాల్లో అధికారులు సైరన్లు మోగిస్తూ ప్రజలను అప్రమత్తం చేశారు. మధ్యాహ్నం 11 గంటల ప్రాంతంలో మరోసారి శ్రీనగర్ ఎయిర్‌పోర్ట్ సమీపంలో భారీగా పేలుళ్లు సంభవించినట్లు– శబ్దాలు వచ్చినట్లు– అధికారులు పేర్కొన్నారు.

# సంపాదకీయం

## సాంకేతిక రంగ విజయాలు

భారతదేశంలో జాతీయ సాంకేతిక దినోత్సవం (జాతీయ సాంకేతిక పరిజ్ఞాన దినోత్సవం) ప్రతి సంవత్సరం మే 11న భారతదేశ సాంకేతిక పురోగతికి సూచకంగా నిర్వహించ బడుతుంది. భారతదేశం 1944 లో సొంత అణు కార్యక్రమాన్ని ప్రారంభించింది. క్రమానుగత పరిశోధన, ఆవిష్కరణల ద్వారా దేశంలో మొట్టమొదటి అణు పరీక్షలను 1974లో నిర్వహించారు. ఆ తర్వాత చాలా కాలానికి అంటే సుమారు 24 ఏళ్ల తర్వాత రెండవ అణు పరీక్షలు జరిగాయి. భారత సైన్యం 1998, మే 11న రాజస్థాన్‌లోని పోఖ్రాన్‌లో అప్పటి ప్రధానమంత్రి అటల్ బిహారీ వాజపేయి నేతృత్వంలో రెండవ అణ్వస్త్ర పరీక్షలు నిర్వహించారు. దీన్నే పోఖ్రాన్-×× (ఐదు న్యూక్లియర్ బాంబుల విస్ఫోటనాల పరీక్షల వరుస) అంటారు. అప్పటి ఏరోస్పేస్ ఇంజనీర్ డా.అబ్దుల్ కలాం నిర్వహించిన మన మొదటి దేశీయ విమానం హంస-3 పరీక్షలు, త్రిశూల్ క్షిపణులు, ఆపరేషన్లు విజయ వంతంగా పరీక్షించబడ్డాయి. ఈ విజయానికి గుర్తుగా భారత దేశాన్ని అణు దేశంగా ప్రకటించడమే కాకుండా మే 11వ తేదీని జాతీయ సాంకేతిక దినోత్సవంగా ప్రకటించి, అధికారికంగా సంతకం చేశారు. అలా జాతీయ సాంకేతిక దినం(టెక్నాలజీ డే)గా జరుపుకుంటున్నారు. అణుశాస్త్ర మరియు సాంకేతిక పరిజ్ఞానంలో అభివృద్ధి చెందిన దేశంగా మన దేశానికి గుర్తింపు తేవడంలో రాజా రామన్న పాత్ర అద్వితీయం. భారత దేశం శాస్త్ర, సాంకేతిక రంగాలలో సంచలన విజయాలు సాధించడంలో, అద్భుతమైన ప్రగతిని సాధించడంలో కీలకపాత్ర వహించిన వారిలో డాక్టర్ రాజారామన్న ఒకరు. భారతదేశం అణుబాంబును తయారు చేయడంలో ఆయన కీలకపాత్ర పోషించారు. ఇందిరా గాంధీ హయాంలో భారత దేశం 1974 మే 18 తేదీన జరిపిన అణు పరీక్ష అప్పట్లో ఒక సంచలనం. దాని వెనక రామన్న కృషి అసమానం. ఇందిరా గాంధీ ప్రధానిగా ఉన్నప్పుడు భారత దేశపు మొట్టమొదటి భూగర్భ అణు పేలుడులో రాజా రామన్న కీలక పాత్ర పోషించారు. అణు పేలుడు పరికరం తయారీకి వెళ్ళే వివిధ విభాగాలలో నైపుణ్యం ఉన్న అనేక బృందాలను ఆయన కలిసి తీసుకు వచ్చారు. రాజస్థాన్ ఎడారిలో పోఖ్రాన్ వద్ద జరిపిన ఈ అణు పరీక్ష ఫలితంగా అమెరికా, యూరోపియన్ దేశాలు ఇండియాపై ఆంక్షలు విధించాయి. ఇండియా పట్ల అణు అంటరాని తనాన్ని పాటించాయి. తాము ఒక పక్క అణ్వస్త్రాలను గుట్టలుగా పేర్చుకుంటూనే ఇండియా లాంటి మూడో ప్రపంచ దేశాలు అణ్వస్త్రాలు సమకూర్చు కోవడానికి వీలు లేదని శాసించాయి. భారత దేశ మొట్ట మొదటి అణు బాంబు నిర్మాణం దేశంలో కూడా రహస్యంగానే సాగింది. బాంబు రూపకల్పన, నిర్మాణం, పరీక్షలలో పాల్గొన్న రాజా రామన్న, పికె అయ్యంగార్, రాజగోపాల చిదంబరం, ఇతరుల నేతృత్వంలో 75 మంది శాస్త్రవేత్తలు, ఇంజనీర్ల బృందం 1967 నుండి 1974 వరకు దీనిపై పనిచేసింది. 75 మంది శాస్త్రవేత్తలకు (బార్క్ అధిపతి రాజా రామన్న నాయకుడు) తప్ప భారత మంత్రులకు ఎవరికీ బాంబు నిర్మాణం అవుతున్న సంగతి తెలియదు. శాస్త్రవేత్తలు కాకుండా భారత ప్రధాని ఇందిరాగాంధి, ఆమె సలహాదారు మరియు అప్పటి మాజీ ప్రిన్సిపల్ కార్యదర్శి పి.ఎన్.హక్సర్, అప్పటి ప్రిన్సిపల్ కార్యదర్శి డి.పి.ధర్ లకు తప్ప రక్షణ మంత్రికి కూడా బాంబు సంగతి తెలియదు. 1972 సెప్టెంబరులో బార్క్ సందర్శించిన ఇందిర నోటిమాటతో బాంబు నిర్మాణానికి, పరీక్షకు ఆదేశాలు ఇచ్చారని భావించ బడింది. 1997లో డాక్టర్ రాజా రామన్న స్వయంగా పోఖ్రాన్ లో పేల్చింది అణు బాంబే అని చెప్పేవరకూ అధికారికంగా దాని గురించి తెలియక పోవడం గమనార్హం. ఇక 1998 మే 11న పోఖ్రాన్-×× పరీక్షల్లో ఐదు విస్ఫోటనాలు జరిగాయి, మొదటిది ఫ్యూజన్ బాంబు కాగా మిగిలినవన్నీ ఫిషన్ బాంబులు (అణువిచ్ఛిత్తి బాంబులు). ఆపరేషన్ శక్తి పేరిట ఒక ఫ్యూజన్ బాంబు, రెండు ఫిషన్ బాంబుల విస్ఫోటనంతో పరీక్షలు 1998 మే 11న ప్రారంభ మయ్యాయి. 1998 మే 13న అదనంగా మరో రెండు ఫిషన్ బాంబులు కూడా విస్ఫోటనం చేశారు. కొద్దిసేపటికి ఆనాటి భారత ప్రధానమంత్రి అటల్ బిహారీ వాజపేయి ఆధ్వర్యంలోని భారత ప్రభుత్వం ఒక పత్రికా సమావేశం నిర్వహించి భారతదేశం పూర్తి-స్థాయి అణ్వస్త్ర దేశమని ప్రకటించింది. ఈ పరీక్షల కారణంగా తర్వాత జపాన్, అమెరికా సంయుక్త రాష్ట్రాలు సహా పలు ప్రధాన దేశాలు భారతదేశంపై రకరకాల ఆంక్షలు విధించాయి. అలా భారత దేశం విజ్ఞాన శాస్త్ర మేధావుల అకుంఠిత కార్యదీక్ష అంకితభావం అన్నిటికీ మించి చిత్తశుద్ధితో చేసిన కృషి వల్ల శాస్త్ర సాంకేతిక రంగాల్లో గణనీయ అభివృద్ధి సాధించగలిగింది. నాటి రాతియుగం నుంచి నేటి రాకెట్ యుగం వరకు జరిగిన మానవ అభివృద్ధి పరిణామ క్రమంలో శాస్త్ర సాంకేతిక పరిజ్ఞాన క్రమాభివృద్ధిదే కీలక పాత్ర. నేడు శాస్త్ర సాంకేతిక రంగమే ప్రపంచాన్ని శాసిస్తున్నది. అభివృద్ధి అంతా సైన్స్ పైనే ఆధారపడి ఉంటుంది. ప్రస్తుతం శాస్త్ర సాంకేతిక విద్యా రంగంలో ...విషయ ప్రాధాన్యం నుంచి ఉత్పత్తి ప్రధాన విద్య దిశగా మార్పు చోటుచేసు కుంటోంది. ఇటీవలి కాలంలో భారత్‌లో సాంకేతిక విద్యా సంబంధ కళాశాలల సంఖ్య శరవేగంగా పెరిగింది. ఐఐటీలు, మరికొన్ని ప్రతిష్ఠాత్మక సంస్థలు మినహా దేశంలోని అత్యధిక శాతం ప్రైవేటు సాంకేతిక కళాశాలలు విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించలేకపోతున్నాయి. పలక బలపం పెన్ను పెన్సిల్ బ్లాక్ బోర్డ్ కనుమరుగు అవుతూ, పాఠ్యపుస్తకాల స్థానంలో ఈబుక్స్, టాబ్ ల ద్వారా విద్యాబోధన జరుగుతున్న నేటి విద్యా వ్యవస్థలో, సాంకేతికత వలన అందరికి అందుబాటులోకి వచ్చింది. చెప్పేవారు ఉంటే, ఏ సమయంలోనైనా ఆన్ లైన్ ద్వారా విద్య అభ్యసించ వచ్చు. అయితే సమకాలీన, సమాజ పరిస్థితులకు అనుగుణంగా బహుళ అంశాల సమన్వయ కూర్పుతో కూడిన సెలబస్, విద్య అనివార్యంగా మారింది. నేర్చుకునే విద్యలో నాణ్యత ఉండాలి. మేధాపరమైన నైపుణ్యాలను విజ్ఞానాన్ని అభివృద్ధి పరచడమే ప్రధానం కావాలి. తద్వారా యువ మేధావులు... నాణ్యమైన విద్య ఆర్జించి, నైపుణ్యాలు సాధించి, అంతర్జాతీయ వ్యవస్థలో నూతన ఆవిష్కర్తలుగా, సమర్థ నిర్ణాయకులుగా భాసిల్లి సమాజాభి వృద్ధికి దోహదపడ గలుగుతారనేది నూటికి నూరుపాళ్లు నిజం.

## సరిహద్దు గ్రామాల్లో కవల పిల్లలు మృతి..

**తల్లులకు ఎంతకాలం ఈ కడుపుకోత?**

శ్రీనగర్ : సరిహద్దులో పాకిస్థాన్ రెచ్చగొట్టే చర్యలకు పాల్పడుతోంది. దీంతో పలువురు సామాన్య ప్రజలు ప్రాణాలు కోల్పోతున్నారు. చిన్నపిల్లలు మృతి చెందడంపై జమ్ముకశ్మీర్ మాజీ ముఖ్యమంత్రి మోహబూబా ముఫ్తీ తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. శుక్రవారం మీడియా సమావేశంలో మాట్లాడుతూ ఉద్వేగానికి గురయ్యారు. " కళ్లముందే ఆటలాడిన కవలలు అంతలోనే రక్తపు మడుగులో కనిపించారు. ఇలా ఎదురుకాల్పుల్లో చిక్కుకొని ప్రాణాలు కోల్పోయిన చిన్నారులు , మహిళలు చేసిన తప్పేంటి ? ఇది ఎక్కడివరకు వెళ్తుంది. జమ్ముకశ్మీర్ ప్రజలు మరీ ముఖ్యంగా సరిహద్దు ప్రాంతాల వారు ఇంకా ఎంతకాలం బాధపడాలి. ? తల్లులకు ఎంతకాలం ఈ కడుపుకోత ? అని ప్రశ్నించారు. అలా మాట్లాడుతూ ఆమె కంటతడిపెట్టారు. ఆపరేషన్ సిందూర్‌తో దిక్కుతోచని పాకిస్థాన్, సరిహద్దులో కవ్వింపు చర్యలకు పాల్పడుతోంది. కుప్వారా, బారాముల్లా, ఉరీ, పూంఛ్, మెంధార్, రాజౌరీ సెక్టార్లలో మోర్టార్లు, శక్తివంతమైన శతఘ్నులతో కాల్పులకు తెగబడింది. దీంతో బుధ, గురువారాల్లో 16 మంది మరణించారు. అందులో ఐదుగురు చిన్నారులు, ముగ్గురు మహిళలు ఉన్నారు. పూంఛ్ సెక్టారులో చనిపోయిన వారిలో లాన్స్‌నాయక్ దినేశ్ కుమార్ (32) ఉన్నారు. ఆయన హర్యాణాకు చెందిన వారు. గురువారం అర్ధరాత్రి దాడిన తరువాత పూంచ్ ,రాజౌరీ, జమ్ములో మరోసారి పాక్ కాల్పులు, షెల్లింగ్ జరిపింది. క్షిపణులు, ఆత్మాహుతి డ్రోన్లు, యుద్ధ విమానాలను మనదేశం పైకి ప్రయోగించింది. సరిహద్దు రాష్ట్రాలైన జమ్ము, కశ్మీర్, రాజస్థాన్, పంజాబ్‌ల పైకి వాటిని వదిలింది. వాటన్నింటినీ మనసైన్యం చిత్తు చేసింది.

# ఉగ్రవాదానికి ఊతం.. పాకిస్తాన్ పతనం

స్వాతంత్ర్యం తర్వాత కూడా భారతదేశానికి శత్రుబాధలు తప్పలేదు. అప్పటి ఆల్ ఇండియా ముస్లింలీగ్ నాయకుడు మహ్మద్‌అలీ జిన్నా భారత్ నుండి ముస్లింలను వేరు చేసి ప్రత్యేక ముస్లిం దేశం కోసం ఒత్తిడి తేవడం జరిగింది. మత ప్రాతిపదికన 1947 ఆగస్టు 14 వ తేదీన ఇండియా విభజన జరిగి పాకిస్తాన్ ఏర్పడింది. పాకిస్తాన్ స్వతంత్ర దేశంగా ఏర్పడి సుమారు 78 సంవత్సరాలు కావస్తున్నా, భారత్‌పై ఆ దేశం ఇంకా ప్రతీకారాలతో రెచ్చిపోవడం దేనికి సంకేతం? భారత్‌పాక్ మధ్య కుదిరిన సిమ్లా, లాహోర్ ఒప్పందాలు ఏమైనాయి? రక్తపాతంతో పాక్ ఇప్పటివరకు ఏం సాధించింది? తన శక్తికిమించిన ఆయుధాలను కొనుగోలుచేసి, అణ్వస్త్రాలను పోగుచేసి, క్షిపణులకు పదును పెట్టి, ఉగ్రవాదులకు ప్రోత్సాహమిచ్చి, భారత ఉపఖండంలో శాంతికి విఘాతం కలిగిస్తున్న దాయాది దేశానికి ఒనగూడే ప్రయోజనమేమీ లేదు. ఇప్పటికే ఆర్థికంగా చితికిపోయి, అంతర్గత కలహాలతో కకావికలమైన పాక్ తన పొరుగుదేశం భారత్‌తో యుద్ధం చేసి, విజయం సాధించగలదనుకోవడం భ్రమ మాత్రమే. ఉగ్రవాదుల ఏరివేతకు భారత్ తలపెట్టిన ఒక చిన్న చర్యకే పాకిస్తాన్ వెన్నులో వణుకు పుట్టింది. పహల్గాం నరమేధానికి ప్రతీకారంగా భారత్ 'ఆపరేషన్ సింధూర్'ను చేపట్టింది. ఉగ్రవాదులను మట్టుపెట్టడంతో భారత్ శాంతిస్తుందని అంతా భావించారు. పాకిస్తాన్ తాను చేసిన పొరపాట్లతో భారత్‌ను రెచ్చగొట్టేలా చేసింది. తత్ఫలితమే పాక్ ప్రస్తుత పరిస్థితికి కారణం. గతంలో భారత్ పాక్ మధ్య అనేక సంఘర్షణలు జరిగాయి. కొన్ని సంఘర్షణలు యుద్ధాలకు దారితీసాయి. 1947- 48 మధ్య, 1965 లోను, 1971 లోను భారత్ పాక్ మధ్య తీవ్రమైన యుద్ధాలు జరిగాయి. ఇరు దేశాల మధ్య 1999లో కార్గిల్ యుద్ధం జరిగింది. భారత్‌తో తలపడిన ప్రతిసారి పాక్ పరాజయం పాలయింది. అయినా ఈ యుద్ధాల నుండి పాక్ గుణపాఠం నేర్చుకోలేదు. పైగా చైనా అండ చూసుకుని భారత్ సమగ్రతను దెబ్బకొట్టాలని పాక్ ప్రయత్నించడం సిగ్గుచేటు. గత నెలలో పహల్గాంలో ఉగ్రవాదులు అమాయకులను మతం పేరు చెప్పి చంపడాన్ని భారత్ తీవ్రంగా పరిగణించింది. పైగా భారత్‌కు హెచ్చరికలు జారీ చేసింది. ఇందుకు ప్రతీకార చర్యలు తీసుకుంటామని భారత ప్రభుత్వం ప్రతినబూనింది. పాకిస్తాన్ ఆక్రమిత కశ్మీర్ లోకి చొచ్చుకుపోయిన భారత సైన్యం 9 ఉగ్రవాద స్థావరాలపై దాడులు చేయడంతో సుమారు 100 మందికి పైగా కరడుగట్టిన ఉగ్రవాదులు హతమైనారు. ఈ దాడుల్లో కరడు గట్టిన తీవ్రవాది మసూద్ అజహర్ కుటుంబ సభ్యులంతా హతులవడం, కాందహార్ విమానం హైజాక్‌లోను, పార్లమెంట్, పఠాన్‌కోట్, పుల్వామా దాడుల్లోను ప్రధాన పాత్ర పోషించిన జైషే మహ్మద్ ఉగ్రవాద సంస్థ ప్రముఖ నాయకుడు అబ్దుల్ రవూఫ్ అజార్ హతమవడం ఉగ్రవాదుల వెన్ను లో వణుకు పుట్టించింది.



భారత్ ఇంతటి సాహసానికి ఒడిగట్టదనుకున్న పాక్ నేలవిడిచి సాము చేసింది. ఎల్ఒసి వెంబడి పాక్ కాల్పులు జరుపుతున్నది. పాక్ భారత దేశంలోని 15 నగరాలను టార్గెట్ చేసింది. నార్త్ నుంచి వెస్టన్ సరిహద్దు వరకు భారత్ మిలిటరీని మట్టుపెట్టడానికి పాక్ ఆర్మీ ప్రయత్నించింది. పాక్ మిస్సైళ్ళు, డ్రోన్లు భారత్ ముందు నిలవలేకపోయాయి. భారత్ ఎయిర్ ఢిఫెన్స్ వ్యవస్థ పాక్ దాడులను తిప్పికొట్టింది. భారత్ ఎయిర్ డిఫెన్స్‌ను లక్ష్యంగా చేసుకున్న పాక్‌కు బుద్ధి చెప్పడానికి భారత్ కూడా పాక్ ఎయిర్ ఢిఫెన్స్ ను టార్గెట్ చేయడం స్వాగతించాలి. రష్యా నుంచి కొనుగోలు చేసిన ఎయిర్ డిఫెన్స్ వ్యవస్థలకు సంబంధించిన ఒప్పందాన్ని అప్పట్లో అమెరికా వ్యతిరేకించి, ఆంక్షలు విధించింది. ఇప్పుడు పాక్‌ను తిప్పికొట్టడానికి రష్యా ఆయుధాలు ఉపకరిస్తున్నాయి. పాక్ ఎంత ప్రమాదకరమో, భారత్‌కు రక్షణ ఎంత ముఖ్యమో అమెరికా ఇప్పటికైనా తెలుసుకోవాలి. చైనా, అమెరికాల వద్ద పాకిస్తాన్ కొనుగోలు చేసిన యుద్ధ విమానాలను భారత్ గగనతలంలోనే పేల్చేసింది. ఈ చర్యతో పాకిస్తాన్ త్రివిధ దళాలు కకావికలమైనాయి. ఎల్‌ఒసి వద్ద (నియంత్రణ రేఖ) ఇరుదేశాల సైన్యం మోహరించి ఉంది. భారత్ సైనికుల సాహసానికి పాక్ సైన్యం ప్రతీకార చర్యలకు దిగినా, భారత్ వ్యూహాలకు దాయాది దేశం బెంబేలెత్తిపోతున్నది. ఆపరేషన్ సిందూర్ పేరుతో జరుగుతున్న పాక్ ప్రేరిత ఉగ్రవాదుల ఏరివేత కార్యక్రమం క్రమేపీ ఇరుదేశాల మధ్య తీవ్రమైన యుద్ధానికి దారితీసే ప్రమాదముంది. పాక్ ఆర్మీ, సివిలియన్స్ జోలికి పోకుండా కేవలం ఉగ్రవాద పోస్టులను నిర్వీర్యం చేయడానికే పరిమితమైన భారత్‌ను పాక్ రెచ్చగొట్టింది. ఉగ్రవాదులతో తమకు సంబంధం లేదని వాదిస్తున్న పాక్ నాయకులు, మిలిటరీ పెద్దలు ఆపరేషన్ సిందూర్‌లో హతులైన ఉగ్రవాదుల అంత్యక్రియలకు హాజరుకావడం, ఉగ్రవాద చర్యలకు సంఘీభావం ప్రకటించడం ద్వారా ప్రపంచం దృష్టిలో పాక్ దోషిగా నిలబడింది. ఉగ్రవాదులకు పాక్ ఇస్తున్న ప్రాధాన్యం గురించి ప్రత్యేకంగా ఇంతకంటే నిదర్శనమేముంటుంది? భారత్‌లోని పలు నగరాల ఎయిర్ ఫోర్టులను, ఎయిర్ బేస్ లను పాక్ టార్గెట్ చేసింది. యుద్ధ విమానాలతో విరుచుకుపడాలని ప్రయత్నించి, తప్పిదం చేసిన పాక్‌కు భారత్ తగిన గుణపాఠం చెప్పింది.

లాహోర్, కరాచీల్లో నిప్పుల వర్షం కురిసింది. జమ్మూకశ్మీర్, ఉద్దంపూర్‌లపై పాక్ క్షిపణి దాడులను భారత్ తిప్పికొట్టింది. లాహోర్, ఇస్లామాబాద్, కరాచీ సియాల్ కోట్‌లను భారత్ టార్గెట్ చేసింది. పాక్ ఈ నగరాలను షట్‌డౌన్ చేసింది. పాక్ ప్రధాని పారిపోయినట్లుగా, బంకర్లలో దాకున్నట్టుగా వార్తలు వెలువడుతున్నాయి. భారత్ ప్రతీకారం ఈ విధంగా ఉంటుందని ఎవరూ ఊహించలేదు. టర్కీ తప్ప ప్రపంచదేశాలేవీ పాక్‌కు మద్దతుగా నిలిచే సాహసం చేయబోవు. ఇస్లామిక్ దేశాలు సైతం పాక్‌కు వ్యతిరేకంగా ఉన్నాయి. పాక్ దుర్మార్గాలు రుచించకపోవడమే కాకుండా భారత్‌తో గల వాణిజ్య సంబంధాలు కూడా ఇందుకు కారణం కావచ్చు. చైనా ప్రత్యక్షంగా పాక్‌కు మద్దతునీయకపోయినా, పరోక్ష సహకారం అందచేస్తుందనడంలో సందేహం లేదు. భారత్‌లో ఉగ్రవాదుల కార్యకలాపాలకు పాక్ మద్దతునిస్తున్నది. ఇందుకు పాక్ ఆక్రమిత కశ్మీర్ భూభాగం ఉగ్రవాదులకు స్వర్గధామంలా మారిందని భారత్ ఎప్పటి నుంచో ఐక్యరాజ్యసమితిలోను, ఇతర అంతర్జాతీయ సంస్థలకు మొరపెట్టుకుంటున్నా ప్రయోజనం లేకుండా పోయింది. జనరల్ జియా ఉల్ హక్ నుండి, ముషారఫ్ వర కు భారత్‌తో పాక్ పలు శాంతి ఒప్పందాలు చేసుకుంది. ఇరు దేశాల మధ్య సుహృద్భావం కోసం అప్పటి ప్రధాని వాజ్ పేయీ లాహోర్ బస్సు యాత్ర కూడా చేపట్టారు. అయినా ప్రయోజనం లేకుండాపోయింది. అన్ని ఒప్పందాలను పాక్ తుంగలో తొక్కింది. సరిహద్దుల వద్ద కాల్పులకు తెగబడుతూ, కవ్వింపులకు పాల్పడుతూ జమ్మూకశ్మీర్‌లో ఉగ్రవాదులను చొప్పించడానికి నిరంతరం ప్రయత్నిస్తున్నది. ఆర్టికల్ 370 రద్దు తర్వాత కొంతకాలం కశ్మీర్‌లో అలజడులు చెలరేగినా, వాస్తవాన్ని అర్థం చేసుకున్న కశ్మీర్ యువత క్రమేపీ తమ జీవితాలను బాగు చేసుకోవడానికి, ఉపాధి అవకాశాల కోసం ప్రయత్నిస్తూ, ఉగ్రవాదం పట్ల విముఖత ప్రదర్శిస్తున్నది. కశ్మీర్‌లో టూరిజం వ్యాప్తిచెందుతూ ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నది. పాకిస్తాన్, పాక్ ఆక్రమిత కశ్మీర్ పరిస్థితిని అర్థం చేసుకుని, పాకిస్తానీయుల చర్యలపట్ల విసుగెత్తి భారత్‌లో ఉంటేనే తమకు మేలని కశ్మీర్ ప్రజలే కాకుండా పిఒకెలోని యువత కూడా భావిస్తున్నది. పాక్‌లోని బెలూచిస్తాన్, సింధు ప్రాంతాల ప్రజలు ఎందుకు పాకిస్తాన్‌పై తిరుగుబాటు బావుటా ఎగరేస్తున్నారో కశ్మీర్ ప్రజానీకం అవగతం చేసుకుంది. అభివృద్ధి బాటలో పయనిస్తున్న బంగ్లాదేశ్‌లో ప్రజాస్వామ్యాన్ని ఖతం చేసి, ఎలా అరాచకాన్ని సృష్టిస్తున్నదో, పాక్ ప్రమేయంతో బంగ్లాదేశ్‌కు ఏ గతి పట్టిందో విదితమే. తాలిబాన్లతో అంటకాగిన పాకిస్తాన్‌కు ప్రస్తుతం అఫ్ఘానిస్తాన్ కు తీవ్రమైన శత్రుత్వం నెలకొంది. పాక్‌లో అంతర్యుద్ధం చెలరేగింది. పాక్‌లోని బలూచిస్తాన్, సింధ్‌లతో పాటు పాక్‌లోని పలు ప్రాంతాల ప్రజలు పాక్ పాలకులకు, సైన్యానికి వ్యతిరేకంగా తీవ్రమైన పోరు కొనసాగిస్తున్నారు. పాక్ పాలకులపై అక్కడి ప్రజలకు నమ్మకం లేదు. ప్రస్తుత భారత్- పాక్ సరిహద్దులు బాంబులతో దద్దరిల్లుతున్నాయి. పలుచోట్ల పాక్ ప్రతీకార దాడులకు తెగబడుతూ క్షిపణులను ప్రయోగిస్తున్నది. పాక్ క్షిపణులను భారత్ గగనతలంలోనే భస్మం చేస్తున్నది. జమ్మూ టార్గెట్‌గా పాక్ దాడులు చేస్తున్నది. పఠాన్ కోట్, శ్రీనగర్, జైసల్మీర్‌పై పాక్ డ్రోన్లను ప్రయోగించినా భారత్ వాటిని కుప్పకూల్చింది. ఏదిఏమైనప్పటికీ భారత దేశం గతంలో మాదిరిగా ప్రపంచ దేశాల ఒత్తిడికి లొంగకుండా పాక్ ఆక్రమిత కశ్మీర్‌ను వశం చేసుకోవాలి.

## బహుముఖ ప్రజ్ఞాశాలి సర్దేశాయి

ఒకవైపు నిరంతర పరిశోధనలు, మరోవైపు సాహిత్య రంగంలో విశేష కృషి, పరిశోధనల ద్వారా పేటెంటు హక్కులు పొందడం, నిరంతర రచనా వ్యాసంగం, అనితర సాధ్యమైన ప్రతిభ ఒక్కరికే సొంతం. అవి సాధించిన వాడు తెలుగు వాడు కావడం గర్వకారణం. ఆయనే అచ్చ తెలుగు వారైన సర్దేశాయి తిరుమల రావు. ఆయన జీవితం పలు ప్రత్యేకతల సమాహారం. 1954లో తైల సాంకేతిక పరిశోధనా సంస్థలో కెమిస్టుగా కెరీర్ ను ప్రారంభించి, 1983 జూలై 31న డైరెక్టర్‌గా పదవీ విరమణ చేసేంత వరకూ సర్దేశాయి తిరుమలరావు ఒక్కరోజు కూడా సెలవు తీసుకోకపోవడం గమనార్హం. ఆయన పేరిట తైలసాంకేతిక రంగంలో పదకొండు పేటెంట్లు ఉండడం విశేషం. సంస్థ కేంద్ర ప్రభుత్వం యేటా ఉత్తమ పరిశోధనా సంస్థలకు ఇచ్చే బహుమతులలో ఐదు సార్లు బంగారు పతకాన్ని, పది సార్లు రజత కాంస్య పతకాలను గెలుచుకోవడం సామాన్యమైన విషయమేమీ కాదు. జాతీయ, విదేశీయ పత్రికలలో తైలసాంకేతికత మీద ఐదు వందలకు పైగా పరిశోధనా, సిద్ధాంత వ్యాసాలు వ్రాయడం ఆయనకే సుసాధ్యమైంది. సర్దేశాయి తిరుమల రావు ( నవంబర్ 28, 1928 - మే 11, 1994) వృత్తిరీత్యా తైల పరిశోధనా శాస్త్రవేత్త. ప్రవృత్తిరీత్యా సాహితీ విమర్శకుడు. ఆజన్మ బ్రహ్మచారి. కర్నూలు జిల్లా జోహారా పురంలో పేద మధ్వ బ్రాహ్మణ కుటుంబంలో కృష్ణవేణమ్మ, నరసింగరావు దంపతులకు 1928, నవంబర్ 28న జన్మించారు. అయన పూర్వీకుడు వెంకన్న పంతులు ఆదోని నవాబు దగ్గర మంత్రిగా పనిచేసి మంత్రాలయంలో రాఘవేంద్ర మఠం స్థాపనకు తోడ్పడిన వారు. ఆదోని, అనంతపురం లలో ప్రాథమిక, ఉన్నత పాఠశాలలో, అనంతపురం దత్త మండల కళాశాల, తరువాతి కాలంలో గవర్నమెంట్ ఆర్ట్స్ కళాశాలలో చదివారు. 1954లో రాజస్థాన్ రాష్ట్రం పిలానికి చెందిన బిర్లా ఇన్స్టిట్యూట్‌నుండి ఎం.ఎస్.సి. కెమిస్ట్రీ ప్రథమశ్రేణిలో ఉత్తీర్ణుడయ్యారు. 1954లో తైల సాంకేతిక పరిశోధనా సంస్థలో కెమిస్టుగా కెరీర్ ను ప్రారంభించి, 1983 జూలై 31న డైరెక్టర్ గా పదవీ విరమణ గావించారు. ఇదిలా ఉంటే ఆయన చేసిన సాహిత్య సేవ ఎనలేనిది. ప్రతి రచననూ విమర్శనాత్మక దృష్టితో చూసే వాడు. కన్యాశుల్క నాటక కళ, సాహిత్య తత్త్వము - శివభారత దర్శనము అనే పుస్తకాలను రాశారు. మాలపల్లి మీద రచన పూర్తి చేయకుండానే ఆయన 11, 1994లో కన్నుమూశారు. ఆయన విమర్శకు గుర్తింపుగా పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వ విద్యాలయం 1989లో తిక్కవరపు రామిరెడ్డి స్మారక పురస్కారాన్ని ఇచ్చింది. అయన సాహిత్య కృషిని గుర్తించి శ్రీకృష్ణ దేవరాయ విశ్వ విద్యాలయం 1989లో గౌరవ డాక్టరేట్ (డి.లిట్) ప్రదానం చేసింది. విమర్శలు మాత్రమే కాకుండా సృజనాత్మక రచనలు కొన్ని చేశారు. వాటిలో 'పద్మావతీ చరణచారణ చక్రవర్తి', 'పగచిచ్చు' అనే నాటికలు, 'భూసూక్తము' అనే కథా ఉన్నాయి. అయన విషయ పరిజ్ఞానానికి, విమర్శనాదృష్టికి, అభిరుచికి అద్దం పట్టే కొన్ని చర్చలు ఇలా ఉన్నాయి. అంతేగాక భారతి, ఆంధ్రపత్రిక, ఆంధ్రప్రభ, ది హిందు, ఇండియన్ ఎక్స్‌ప్రెస్, బ్లిట్జ్, సైన్స్‌టుడే మొదలైన పత్రికలలో సాహిత్య, సాహిత్యేతర అంశాలపై ఎన్నో వ్యాసాలు, ఉత్తరాలు వ్రాశారు. చర్చలు చేశారు. అసలు పేరుతో పాటుగా 'తి', 'నిశ్శంకతిమ్మణ్ణ', 'పైథోగొరస్' మొదలైన తొమ్మిది కలంపేర్లతో రచనలు చేశారు. భారత,రామాయణ,భాగవతముల ఆద్యంతముల ఆంతర్యముబీ తిక్కన స్త్రీపర్వములోని ఛందో వైవిధ్యములోని ఆంతర్యముబీ వేదవ్యాసుడు బ్రాహ్మణేతరుడా? కన్యాశుల్కంలో అసభ్యత ఉన్నదా?బీ హిమలేహ్యం - శేషేంద్ర జాలంబీ మినీకవిత - మార్క్సీ వ్యాఖ్యబీ తెలుగు మీద కన్నడ ప్రభావ మెంత? మాలపల్లి పై ఈస్టలిన్ ప్రభావం కలదా? లాంటి వ్యాసాలను వివిధ పత్రికలలో ప్రచురించారు. తెలుగు విశ్వ విద్యాలయం రాచపాళెం చంద్రశేఖరరెడ్డి సంపాదకత్వంలో సర్దేశాయి తిరుమలరావు విమర్శ వ్యాసాలను విమర్శ - ప్రతివిమర్శ పేరుతో ప్రకటించింది. 1965 ప్రాంతం నుండి 1994లో కన్నుమూసేంత వరకూ భారతి, ఆంధ్రపత్రిక, ఆంధ్రప్రభ, ది హిందు, ఇండియన్ ఎక్స్‌ప్రెస్ పత్రికలలో రాసిన వ్యాసాలను, లేఖలను, సాహితీ విమర్శలను సేకరించి జ్ఞానసింధు సర్దేశాయి తిరుమలరావు అనే పుస్తకంగా తీసుకొచ్చారు.

## ప్రధాని షెహబాజ్ షరీఫ్ పిరికివాడు

ఇస్లామాబాద్ : పాకిస్తాన్ ప్రజలు, నేతలు, సైన్యం భారత్ దాడులతో బెంబేలెత్తుతున్న వేళ%ా%పాకిస్తాన్ పార్లమెంట్ సభ్యుడే ఏకంగా ఆ దేశ ప్రధానిపై విపరీతమైన వ్యాఖ్యలు చేశారు. ప్రధాని షెహబాజ్ షరీఫ్ పిరికివాడు అని వ్యాఖ్యానించారు. ప్రధాని తీరే ఇలావుంటే భారత్‌పై ఏ విధంగా పోరాడగలమంటూ ఆయన వ్యాఖ్యానించారు. భారత దాడుల గురించి పాకిస్తాన్ పార్లమెంట్‌లో ప్రసంగిస్తూ ఎంపి తహీర్ ఇక్బాల్ ఈ వ్యాఖ్యలు చేశారు. ప్రధాని షరీఫ్‌పై ఎంపి చేసిన ఈ వ్యాఖ్యలు వీడియో సోషల్ మీడియాలో బాగా వైరల్ అయింది. పాక్‌లోని పలు లక్ష్యాలపై భారత్ దాడులు చేసిన వెంటనే షరీఫ్ పత్రికా సమావేశంలో మాట్లాడారు. ఆయన ఆ సమావేశంలో వ్యవహరించిన తీరు చాలా పేలవంగా వుందంటూ కూడా పలువురు నెటిజన్లు ట్రోల్ చేశారు.



## మంత్రి కొండాను కలిసిన తెలంగాణ ఫారెస్ట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ వైస్ చైర్‌పర్సన్ ఎండి సునీత ఎం భగవత్



**హైద్రాబాద్ జై భీమ్ న్యూస్**

తెలంగాణ ఫారెస్ట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ వైస్ చైర్‌పర్సన్, మేనేజింగ్ డైరెక్టర్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్న సునీతా ఎం. భగవత్, అటవీ, పర్యావరణ,దేవాదాయ ధర్మాదాయశాఖ మంత్రివర్యులు కొండా సురేఖని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా అటవీ అభివృద్ధి, హరిత తెలంగాణ లక్ష్యాల అమలులో మంత్రి కొండా సురేఖ, సునీత భగవత్ కు దిశా నిర్దేశం చేశారు.

## ఈవీఎం గోదాములను పరిశీలించిన జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారదా




**వరంగల్ జిల్లా జై భీమ్ న్యూస్**

వరంగల్ ఎనుమాముల వ్యవసాయ మార్కెట్ యార్డ్ లో జిల్లా గోదాములను జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారదా, ఆదనవు కలెక్టర్ సంధ్యారాణితో కలసి శనివారం పరిశీలించారు. కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ప్రతి నెలకు ఒకసారి నిర్వహించే సాధారణ తనిఖీలలో భాగంగా ఎనుమాముల వ్యవసాయ మార్కెట్ యార్డు లోని జిల్లా ఈవీఎం గోదాములను కలెక్టర్ తనిఖీ చేసి, ఈవీఎంలు భద్రపరిచిన స్ట్రాంగ్ రూమ్ గోదాంలకు సంబంధించిన రికార్డులు, కట్టుదిట్టమైన భద్రత చర్యలు, సీసీ కెమెరాల నిరంతర పర్యవేక్షణ గురించి వివరాలను అధికారులను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. ఈ తనిఖీలో తహసీల్దార్ ఇక్బాల్, నాయబ్ తహసీల్దార్ రంజిత్, తదితరులు పాల్గొన్నారు.

# పాక్ దొమ్మి దాడి వమ్ము

న్యూఢిల్లీ : పాకిస్థానీ దాడుల వ్యవస్థను భారత సైన్యం ఏళ్ల తరబడి



సంతరించుకుని ఉన్న ధీటైన ఆయుధ వ్యవస్థతో ఛిన్నాభిన్నం చేసింది. రష్యా నిర్మిత ఎస్ 400, బరాక్, 8, ఆకాశ్ క్షిపణులను , సంబంధిత వ్యవస్థను భారతీయ సేనలు తమ ఎదురుదాడులకు వాడాయి. చాప కింద నీరుగా పాకిస్థాన్ చైనా ఇతర దేశాల నుంచి సంతరించుకున్న పలు శ్రేణుల ఎఫ్ 16 ఫైటర్లు డ్రోన్ల వ్యవస్థను లక్షాలు చేరనివ్వకుండా మధ్యలోనే నిలిపివేసి, దెబ్బతీసేందుకు భారత్ అత్యంత కీలకమైన ఆయుధ వ్యవస్థలను రంగంలోకి దింపింది. శత్రుదేశం పాకిస్థాన్ దూకుడు తీరును బట్టి ఇప్పుడు ఎస్ ఆయుధ వ్యవస్థను ఇతర క్షిపణులను వాడారు. తరువాతి క్రమంలో పరిస్థితిని బట్టి మరింత ఆయుధ పాటవం రంగంలోకి దిగుతుందని సైనిక వర్గాలు తెలిపాయి. భారతదేశంలో అత్యంత కీలక ప్రాంతాలలో నెలకొని ఉన్న వివిధ స్థాయిల సైనిక స్థావరాలను ఎంచుకుని దాడులకు దిగేందుకు , పెద్ద ఎత్తున నష్టం కల్గించేందుకు పాకిస్థాన్ సమాయత్తం అయింది. దీనిని భారతీయ ఇంటలిజెన్స్ వర్గాలు ముందుగా పసికట్టాయి. ఈ క్రమంలోనే పాకిస్థాన్‌కు ఉన్న బలీయ క్షిపణి వ్యవస్థను దెబ్బతీసేందుకు అవసరం అయిన కీలక ఆయుధ వ్యవస్థలకు పని చెప్పిందని వెల్లడైంది.

# నేటి నుంచి హైదరాబాద్‌లో కఠిన ఆంక్షలు

**సీపీ సీవీ ఆనంద్**

**హైద్రాబాద్ జై భీమ్ న్యూస్**

హైదరాబాద్ నగరంలో బాణాసంచా కాల్చడంపై పోలీసులు నిషేధం విధిం చారు. పెళ్లిళ్లు, పండుగలు, షాపుల ప్రారంభోత్సవాలు వంటి ఏ సందర్భంలోనైనా సరే బాణాసంచా కాల్చడం పై నిషేధం ఉంటుందని తెలిపారు. బాణాసంచా అమ్మేవారికి కూడా హెచ్చరికలు జారీ చేశారు. బాణాసంచా కాల్చి తే జైలుకు పంపుతామని పోలీసులు స్పష్టం చేశారు. ఈ నిషేధానికి ప్రధాన కారణం దేశంలో నెలకొన్న ఉద్రిక్త పరిస్థితులే. హైదరా బాద్ పోలీస్ కమిషనర్ సీవీ ఆనంద్ తెలిపిన వివరాల ప్రకారం.... దేశంలో యుద్ధ వాతా వరణం నెలకొనడం, నగరంలో భద్రతా చర్యలు కొనసాగుతుండటంతో ఈ నిర్ణయం తీసుకున్నారు. బాణాసంచా శబ్దాలు పేలుళ్లుగా అన్వయించు కునే ప్రమాదం ఉండటంతో ప్రజల్లో భయాందోళనలు నెలకొనే అవకాశం ఉంది. ఇది శాంతి భద్రతలకు విఘాతం కలిగించవచ్చు. అంతేకాకుండా, బాణాసం చా శబ్దాలు భద్రతా దళాలపై అనవసరమైన ఒత్తిడిని కలిగిస్తాయి. దేశ వ్యాప్తంగా కొనసాగుతున్న ఉగ్రవాద కార్యకలాపాల నేపథ్యంలో, బాణాసంచా కాల్చడం వల్ల ఏదైనా అత్యవసర పరిస్థితి ఏర్పడితే స్పందించడం కష్టమవుతుందన్నారు. మరోవైపు నగరవ్యాప్తంగా పోలీసులు భద్రతను కట్టుదిట్టం చేశారు అత్యంత సమస్యాత్మక ప్రాంతాల్లో భారీగా పోలీసు బలగాలు మొహరించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటన లు జరగకుండా ముందస్తు చర్యలు తీసుకుంటున్నారు. సిపి సీవీ ఆనంద్, భద్రతను ఎప్పటి కప్పుడు పర్యవే క్షిస్తున్నారు. బందోబస్తు పై పోలీసులకు సూచనలు ఇస్తున్నారు. ప్రజలు ఎలాంటి బయభ్రాంతులకు గురి కావద్దని ప్రజలకు ఆయన భరోసా కనిపిస్తు న్నారు. అలాగే నగరంలో అనుమానాస్పద వ్యక్తులపై కూడా పోలీసులు ఫోకస్ పెట్టారు. ఈ ఆదేశాలను ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. ఈ నిషేధా జ్ఞలు తదుపరి ఆదేశాల వరకు కొనసాగుతాయని తెలిపారు.



# భద్రకాళి ఆలయంలో కన్నుల పండుగగా చూర్ణోత్సవం

**వరంగల్ జై భీమ్ న్యూస్**

చరిత్ర ప్రసిద్ధిగాంచిన శ్రీ భద్రకాళీ దేవస్థానంలో గత పదకొండు రోజులుగా ఎంతో వైభవంగా నిర్వహింపబడుతున్న శ్రీ భద్రకాళీ భద్రేశ్వరుల శ్రీ కళ్యాణ బ్రహ్మోత్సవాలు శనివారం చక్రతీర్థోత్సవం (చక్రస్నానం), ధ్వజ అవరోహణం, ఘటాభిషేకం పుష్పయాగంతో సుసంపన్నమయ్యాయి. అమ్మవారికి ఉదయం గం. 04-00లకు నిత్యాహ్నికం పూర్తిచేసిన తర్వాత స్నపనవిధి విశేష పూజాదికములు నిర్వహించి అమ్మవారికి చూర్ణోత్సవం జరిపారు. శనివారం సువాసినీమణులు (ముత్తయిదువలు) అందరూ కలసి జరిపిన చూర్ణోత్సవం కన్నుల పండుగగా జరిగింది. అమ్మవారి అభిషేకానికి పసుపుకొమ్ములు, సుగంధ ద్రవ్యాలు అన్నీ ఒకచోట చేర్చి తిరగలిలో వేసి ముత్తయిదువలు విసిరి అమ్మవారికి ఒక పాత్రలో సమర్పించారు. ఈ చూర్ణాన్నే చక్రతీర్థోత్సవంలో, అమ్మవారికి నలుగు పిండిగా ఉపయోగించి స్నపనం జరుపుతారు. చక్రతీర్థోత్సవం (చక్రస్నానం) ముఖ్య అర్చకులు చెప్పెల వెంకటనాగరాజ శర్మ నేతృత్వంలో వైభవంగా నిర్వహింపబడింది. దర్శించిన భక్తులు ఒక దివ్యానుభూతికి లోనయి ఆనంద పరవశులయ్యారు. అనంతరం భేరీతాడనం జరిపి ధ్వజావరోహణం చేశారు. బ్రహ్మోత్సవ నిర్వహణలో అధికారుల, అర్చకుల, భక్తులు లేదా తదితరులెవ్వరివల్లనైనా జ్ఞాతాజ్ఞాతంగా జరిగిన పొరపాట్లు లేదా న్యూనాతరిక్త దోషాలవల్ల సంక్రమించే పాపం తొలగిపోయి బ్రహ్మోత్సవ సంపూర్ణ సాంగత్వం కలిగి భక్తులందరికీ శుభాలు ప్రాప్తింపజేయడానికి శాస్త్రంలో చెప్పబడిన ప్రకారం అమ్మవారికి శతఘటాభిషేకం జరిపి రాత్రి పుష్పయాగం నిర్వహించారు. పుష్పయాగంలో అనేకమంది భక్తులు పాల్గొన్నారు. శాస్త్రంలో చెప్పబడిన మేరకు పుష్పయాగంలో అమ్మవారికి అర్చకులు పదిసార్లు జరిపిన దశార్చనారాధన భక్తులకు అనిర్వచనీయమైన అనుభూతిని ప్రసాదించింది. శనివారం కార్యక్రమాలకు ఉభయదాతలుగా శ్రీ లక్ష్మీదేవి అసోసియేట్స్, హైదరాబాదు వారు వ్యవహరించారు. శనివారం శ్రీ భద్రకాళీ దేవస్థానం, వరంగల్ వారి ఆధ్వర్యవములో నిర్వహింపబడుతున్న శ్రీ భద్రకాళీ సాంగవేద ఆగమ సంస్కృత విద్యాలయాన్ని జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయం, తిరుపతి వారి అనుబంధ విద్యా సంస్థగా గుర్తింపు ఇవ్వడానికి విశ్వవిద్యాలయం ప్రతినిధి బృందం ప్రొ. వేదాంతం విష్ణుభట్టాచార్య వారి నేతృత్వంలో ప్రొ. రమేష్ బాబు, డా. కళ్యాణశాస్త్రి గారలు శనివారం వేదపాఠశాలను సందర్శించి వేదపాఠశాల స్థితిగతులను పరిశీలించి వెళ్ళారు. ఆలయ సహాయ కమీషనర్, ఈఓ శేషభారతి మాట్లాడుతూ భద్రకాళీ భద్రేశ్వరుల శ్రీ కళ్యాణ బ్రహ్మోత్సవాలు విజయవంతం కావడానికి సహకరించిన అధికార, అనధికార ప్రముఖులు, దాతలు, భక్తులు, కులసంఘాలు ముఖ్యంగా ఎలక్ట్రానిక్, ప్రింట్ మీడియా వారికి ధన్యవాదాలు తెలిపారు.



# ఎన్టీఆర్, పివి పురస్కారాలకు దరఖాస్తుల ఆహ్వానం





డాక్టర్ పొడిచెట్టి విష్ణువర్ధన్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు, తెలుగు వెలుగు సాహితీ వేదిక జాతీయ చైర్మన్ పోలోజు రాజ్ కుమార్

**హైద్రాబాద్ జై భీమ్ న్యూస్**

తెలుగు వెలుగు సాహితీ వేదిక,తెలుగు ఇండియన్ కల్చరల్ బుక్ ఆఫ్ రికార్డ్స్, కాళోజీ తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్ సంయుక్త నిర్వహణలో తెలుగువారు గర్వించదగిన మహానటుడు విశ్వవిఖ్యాత నటరత్న పద్మశ్రీ డాక్టర్ నందమూరి తారక రామారావు, సాహితీవేత్త బహుభాషా కోవిదుడు తెలుగు తేజం మాజీ ప్రధాని భారత రత్న పీవీ నరసింహారావు జయంతి ఉత్సవాలను పురస్కరించుకొని ఎన్టీఆర్, పివి నరసింహారావు పురస్కారాలకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు తెలుగు వెలుగు సాహితీ వేదిక జాతీయ చైర్మన్ పోలోజు రాజ్ కుమార్,జాతీయ అధ్యక్షులు డాక్టర్ అప్పినపల్లి భాస్కరాచారి, తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ పొడిచెట్టి విష్ణువర్ధన్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ మండలి లక్ష్మణ బాబులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. బుద్ధపూర్ణిమ, ఐరావతం, మహానంది, నటరాజ, భారత కీర్తి కిరీటి, నాట్య మయూరి పురస్కారాలను ప్రధానం చేయనున్నట్లు తెలిపారు. పురస్కారాలకు గాను ఈవెంట్ ఆర్గనైజర్,ఈవెంట్ మేనేజర్, డాన్స్ మాస్టర్లు, యాంకర్లు, సాహిత్యం, రచన,కవులు, కళాకారులు, సంగీతం, నృత్యం, భరతనాట్యం, కూచిపూడి, కోలాటం, చిత్రలేఖనం, శిల్పి, నాటకం, జానపదం, మిమిక్రీ, అవధానం, విద్య, వైద్యం, ఇంద్రజాలం, ముకాభినయం, హరికథ,ఒగ్గు కథ, బుర్రకథ, రంగస్థల కళాకారులు, వాస్తు, జ్యోతిష్యం, భక్తి, పురోహితం, యోగా, క్రీడా, సామాజిక సేవా,షార్ట్ ఫిలిం,పర్యావరణ పరిరక్షణ,సైన్స్ అండ్ టెక్నాలజీ, డోలక్, హార్మోనియం,భజన కళా, వ్యవసాయం, కరాటే, మ్యాజిక్, టీవీ నాటక కళాకారులు, యువజన,మహిళ సంఘాలు, ఉపాధ్యాయ, ఉద్యోగ, విద్యార్థి, గ్రామీణ అభివృద్ధి తదితర రంగాలలో కృషి చేస్తున్న ప్రతిభావంతులైన వారు దరఖాస్తు చేసుకోవచ్చని నిర్వాహకులు తెలిపారు. దరఖాస్తు చేసుకునే వారు మే 15 వరకు దరఖాస్తు చేసుకోవాలన్నారు. పురస్కారాల ప్రధానోత్సవ కార్యక్రమం జూన్ 15న హైదరాబాదులో జరుగుతుందన్నారు. పూర్తి వివరాలకు 9494400158, 9100174351 నెంబర్లలో సంప్రదించాలన్నారు.

## శ్రీనగర్‌లో టెన్షన్ టెన్షన్..

భారత్-పాకిస్థాన్ మధ్య ఉద్రిక్తతల నేపథ్యంలో శ్రీనగర్‌లో ఎన్ఐటి విద్యార్థులు ఆందోళనలో ఉన్నారు. సరిహద్దుల్లో బాంబుల మోత మోగుతుండడంతో విద్యార్థులు భయంతో వణికిపోతున్నారు. శ్రీనగర్ ఎన్ఐటిలో 300 మందికి పైగా విద్యార్థులు ఉన్నారు. పది మంది తెలుగు విద్యార్థులు ఉన్నట్టు సమాచారం. విద్యార్థులను సురక్షిత ప్రాంతాలకు తరలించనున్నారు. విద్యార్థులను స్వస్థలాలకు పంపేందుకు భద్రతా అధికారులు ప్రయత్నం చేస్తున్నారు. ఢిల్లీలోని తెలంగాణ భవన్‌లో కంట్రోల్ రూమ్ తమని కాపాడాలని తెలంగాణ పౌరులు ఎమర్జెన్సీ కాల్స్ చేశారు. సరిహద్దుల్లో చిక్కుకున్నామని సహాయం చేయాలని 30 ఫోన్ కాల్స్ చేసినట్టు సమాచారం. 8 మందిని సురక్షితంగా కాపాడినట్టు కంట్రోల్ రూమ్ అధికారులు వెల్లడించారు. కేంద్ర మంత్రి బండి సంజయ్‌కు ఎపి, తెలంగాణ విద్యార్థులు లేఖ రాశారు. కశ్మీర్ నుంచి సురక్షిత ప్రాంతాలని తరలించాలని కోరడంతో కేంద్ర మంత్రి బండి సంజయ్ తక్షణమే స్పందించారు. యూనివర్సిటీ అధికారులు, కలెక్టర్‌తో బండి సంజయ్ మాట్లాడారు. తెలుగు రాష్ట్రాలకు చెందిన 23 మంది విద్యార్థులను అధికారులు సురక్షిత ప్రాంతాలకు తరలిస్తున్నారు.

## పాకిస్తాన్‌కు గట్టి జవాబు ఇస్తున్నాం

న్యూఢిల్లీ : పాకిస్తాన్‌కు గట్టి జవాబు ఇస్తున్నామని కల్నర్ సోఫియా ఖురేషి తెలిపారు. శనివారం జరిగిన ప్రెస్‌మీట్‌లో కల్నర్ సోఫియా ఖురేషి మాట్లాడుతూ.. పాకిస్తాన్ రెచ్చగొడుతూ దాడులు చేస్తూనే ఉందన్నారు. 24 చోట్ల ఫైటర్ జెట్లతో దాడికి ప్రయత్నించిందని.. పాకిస్తాన్ భారత సరిహద్దుల వెంట భారీగా దాడులు చేస్తోందని తెలిపారు. శ్రీనగర్, అవంతీపురా, ఉద్ధంపూర్ వైమానిక స్థావరాలపై దాడులు చేసిందన్నారు. ప్రతీగా పాకిస్తాన్ ఎయిర్ బేస్‌లపై భారత్ ప్రతిదాడులు చేసిందన్నా. భారత్ పూర్తి సంయమనంతో వ్యవహరిస్తోందని తెలిపారు. ప్రతిదాడుల్లో భాగంగా బాలిస్టిక్ క్షిపణులను వాడుతున్నామన్నారు. %ం%-400ను ధ్వంసం చేశామంటూ పాక్ తప్పుడు ప్రచారం చేస్తున్నట్లు తెలిపారు. వింగ్ కమాండర్ వ్యోమిక సింగ్ మాట్లాడుతూ.. పశ్చిమ సరిహద్దుల్లో పాక్ మిస్సైల్ దాడులకు పాల్పడుతుందన్నారు. పాక్ ఫైటర్ జెట్లు పదేపదే భారత భూభాగంలోకి చొచ్చుకువస్తున్నాయన్నారు. పంజాబ్‌లోని పలు కీలకమైన ఎయిర్ బేస్‌లను లక్ష్యంగా చేసుకున్నాయని.. మానవత్వం మరిచి శ్రీనగర్‌లోని స్కూళ్లు, ఆసుపత్రులపై కూడా దాడులకు తెగబడుతోందన్నారు. రాడార్ కేంద్రాలు, ఆయుధ నిల్వ కేంద్రాలను కూడా టార్గెట్ చేస్తున్నట్లు తెలిపారు. శ్రీనగర్‌లోని విద్యా సంస్థలు, వైద్యాలయాలపై దాడులు చేయడం వారి మానవత్వం లేని చర్యలకు నిదర్శనమన్నారు. అయితే భారత సైన్యం పూర్తి అప్రమత్తతతో ఉంటూ శత్రువుల ప్రతి చర్యను తిప్పికొడుతోందన్నారు. విదేశాంగ కార్యదర్శి విక్రమ్ మిస్రీ మాట్లాడుతూ.. పాకిస్తాన్ ఈ రోజు ఉదయం కూడా దాడులు చేసిందన్నారు. పాక్ సైన్యం సామాన్య ప్రజలను, వారి ఇళ్లను టార్గెట్‌గా చేసుకుని దాడులు చేస్తుందన్నారు. పాక్ దాడులకు భారత సైన్యం ప్రతిదాడి చేస్తున్నట్లు తెలిపారు.



# రెడ్ స్క్వేర్‌లో ఘనంగా విక్టరీ డే పరేడ్ ఉత్సవాలు

మాస్కో : విక్టరీ డే పరేడ్ సందర్భంగా రష్యా శుక్రవారం ఉదయం రెడ్ స్క్వేర్‌లో తన సైనిక పాటవాన్ని ప్రదర్శించింది. రెండో ప్రపంచ యుద్ధంలో నాజీ జర్మనీపై సోవియట్ యూనియన్ సాధించిన విజయానికి గుర్తుగా మాస్కోలో జరుగుతున్న ఈ విజయోత్సవాలకు దాదాపు 30 మంది పైగా ప్రపంచ నేతలు హాజరయ్యారు. హాజరైన వారిలో చైనా అధ్యక్షులు జి జిన్‌పింగ్, బ్రెజిల్ అధ్యక్షులు లూలా డసిల్వా, వెనిజులా అధినేత నికొలస్ మదురో, క్యూబా అధ్యక్షులు కానెల్ సహా పలువురు రష్యా మిత్ర దేశాల నేతలు కూడా వున్నారు. కాగా ఈ ఉత్సవాలకు వచ్చిన యురోపియన్ నేతల్లో సెర్బియా, స్లోవేకియా అధ్యక్షులు మాత్రమే వున్నారు. చివరి నిముషంలో అజర్‌బైజాన్, లావోస్ అధ్యక్షుల పర్యటనలు రద్దయ్యాయి. అమెరికా నుండి ఉన్నత స్థాయిలో అధికారులెవరూ ఈ పరేడ్‌లో పాల్గనలేదు. ఆర్మేనియా, ఇజ్రాయిల్, మంగోలియా, అమెరికా సహా పలు దేశాలకు చెందిన రెండో ప్రపంచ యుద్ధ వీరులు గౌరవ అతిథులుగా హాజరయ్యారు. పరేడ్ ప్రారంభం కాగానే రష్యా రక్షణ మంత్రి ఆంద్రె బెలూసొవ్ సైనిక బలగాను అభినందించారు. పరేడ్‌లో 11 వేల మందికి పైగా సైనికులు కవాతు నిర్వహించారు. ప్రత్యేక మిలటరీ ఆపరేషన్ పేరుతో ఉక్రెయిన్ యుద్ధంలో పాల్గన్న మరో 1500 మంది సైనికులు కూడా ఈ కవాతులో పాల్గన్నారు. మిత్రదేశాల సైన్యం కూడా ఈ కార్యక్రమంలో పాల్గంది. మాస్కోతో పాటుగా రష్యా వ్యాప్తంగా ఇతర నగరాలైన సెయింట్ పీటర్స్‌బర్గ్, వ్లాదివొస్తోక్, ఉలన్‌ఉడ్, నొవొసిబిర్‌స్తిక్, ఉఫా, కజన్, తదితర నగరాల్లో విక్టరీ డే ఉత్సవాలు జరిగాయి. రెడ్ స్క్వేర్‌లో సాంప్రదాయ విజయ దినోత్సవాన్ని పురస్కరించుకుని చేసే ప్రసంగంలో భాగంగా పుతిన్ ప్రసంగించారు. "వాస్తవం, న్యాయం మన పక్షాన వున్నాయి. యావత్ దేశాంమన సమాజం, మన ప్రజలు ఈ ప్రత్యేక మిలటరీ ఆపరేషన్‌లో పాల్గన్నవారి వెంట వున్నారు." అని వ్యాఖ్యానించారు. "వారి సాహసాన్ని, కృత నిశ్చయాన్ని చూసి మేం గర్వపడుతున్నాం. ఆ స్ఫూర్తి బలమే మాకు ఎప్పుడూ విజయాన్ని అందిస్తుంది." అని పుతిన్ పేర్కొన్నారు. నాజీవాదం, రష్యా ఫోబియా, యూదు విముఖతలకు వ్యతిరేకంగా రష్యా పోరాటాన్ని కొనసాగిస్తుందని చెప్పారు. రెండో ప్రపంచ యుద్ధం నుండి నేర్చుకున్న గుణపాఠాలను గుర్తుంచుకుంటామన్నారు. ఆ సంఘటనలను వక్రీకరించడాన్ని ఎన్నడూ అనుమతించబోమన్నారు.



# ఆహార ధాన్యాలకు కొదువ లేదు..

న్యూఢిల్లీ: దేశంలో డిమాండ్‌కు తగినట్టు ఆహార ధాన్యాలు పుష్కలంగా ఉన్నాయని, నిత్యావసరాలను అక్రమంగా నిల్వచేసి కృత్రిమ కొరతను సృష్టించడానికి ప్రయత్నించరాదని ప్రభుత్వం హెూల్‌సేల్ వ్యాపారులను హెచ్చరించింది. భారత్ పాకిస్థాన్ మధ్య సంఘర్షణ కొనసాగుతున్న నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం ఈ ప్రకటన చేసింది. ఈ విషయంలో ప్రజలు ఆందోళన చెందడం కానీ, ఆహార ధాన్యాల కొనుగోలుకు మార్కెట్లకు పరుగులు తీయడం కానీ అక్కరలేదని కేంద్ర ఆహార , వినియోగదారుల వ్యవహారాల మంత్రి ప్రహ్లాద్ జోషీ సామాజిక మాధ్యమంలో విజ్ఞప్తి చేశారు. హెూల్‌సేల్, రిటైల్ వ్యాపారులు, వ్యాపార సంస్థలు చట్టపరసంస్థలకు సహకరించాలని ఆయన కోరారు. ఎవరైనా నిత్యావసరాలను అక్రమంగా దాచిపెట్టినా, నిల్వచేసినా, నిత్యావసరాల చట్టం కింద శిక్షకు గురవుతారని హెచ్చరించారు. బియ్యం, గోధుమలు, పప్పుధాన్యాలు, ఇవన్నీ మామూలు స్థాయి కన్నా ఎక్కువగానే అందుబాటులో ఉన్నాయన్నారు. ఇదిలా ఉండగా, కేంద్ర వ్యవసాయ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ శుక్రవారం దేశంలో ఆహార ధాన్యాల నిల్వలపైన, రుతుపవనాలతో ప్రారంభం కానున్న ఖరీఫ్ సీజన్‌కు సన్నద్ధతపై సమీక్షించారు. పాక్‌తో సాగుతున్న సంఘర్షణ కారణంగా సరిహద్దుల్లోని రైతులు విత్తనాలు నాటే పనుల్లో ఎలాంటి ఇబ్బందులు పడకుండా అధికారులు సూచనలిస్తూ సహకరించాలన్నారు. సరిహద్దుల్లోని గ్రామాలు ఖాళీ చేసే పరిస్థితి ఏర్పడితే వారికి కావలసిన సౌకర్యాలు ఏర్పాటు చేయడానికి ఆయా రాష్ట్రాల, కేంద్రపాలిత ప్రాంతాల ముఖ్యమంత్రులతో మాట్లాడతానని చెప్పారు. ఆహార ధాన్యాల సరఫరా పరిస్థితిని వివరిస్తూ వరిధాన్యం సాధారణ నిల్వలు 135 లక్షల టన్నులు కాగా, ప్రస్తుతం 356.42 లక్షల టన్నుల వరకు ఉన్నాయని, అలాగే గోధుమలు సాధారణ నిల్వ 276 లక్షల టన్నులు కాగా, ప్రస్తుతం 383.32 లక్షల టన్నుల వరకు ఉన్నాయని వివరించారు. ఇవేకాక 17 లక్షల టన్నుల ఖాద్యతైలాల నిల్వలు ఉన్నాయని తెలిపారు. అక్టోబర్ నుంచి సెప్టెంబర్ వరకు చక్కెర మార్కెటింగ్ సీజన్ కాగా, 79 లక్షల టన్నుల చక్కెర నిల్వలతో సీజన్ ప్రారంభమవుతుందని, 262 లక్షల టన్నుల వరకు ఉత్పత్తి కావచ్చని అంచనా వేశారు. ప్రస్తుతం దాదాపు 257 లక్షల టన్నుల చక్కెర ఉత్పత్తి అయిందని చెప్పారు.

# సరిహద్దుల్లో డ్రోన్ వార్

న్యూఢిల్లీ : సరిహద్దుల్లో టెన్షన్ టెన్షన్ వాతావరణం నెలకొంది. పాక్ యథేచ్ఛగా కాల్పుల విరమణకు తూట్లు పొడుస్తోంది. శుక్రవారంనాడు రాత్రి నియంత్రణ రేఖతో పాటు జమ్మూ, పంజాబ్, రాజస్థాన్, గుజరా త్ సరిహద్దుల్లో పాక్ డ్రోన్ల వర్షం కురిపించింది. ఆయా రాష్ట్రాల్లోని మొత్తం 20పట్టణాలను లక్షంగా చేసుకుంది. అయితే భారత బలగాలను పాక్ డ్రోన్ దాడులను సమర్థంగా తిప్పికొట్టాయి. జమ్మూ కశ్మీర్‌లోని అవంతిపోరా ఎయిర్‌బేస్, ఎయిర్‌పోర్ట్‌పై దాడియత్నాన్ని బలగాలు భగ్నం చేశాయి. మరోవైపు శ్రీనగర్‌లో రాత్రి 9.22గంటలకు భారీ పేలుడు శబ్దం వినిపించింది. మూడు రాష్ట్రాల్లో పలు చోట్ల కాల్పులు, పేలుళ్ల శబ్దాలు వినిపించాయి. పఠాన్‌కోట్, సాంబా, జైసల్మీర్, బార్మర్, పోఖ్రాన్ ప్రాంతాల్లో డ్రోన్ దాడులకు పాక్ యత్నించింది. పంజాబ్‌లోని అమృత్‌సర్, హెూషియాపూర్, గురుదాస్‌పూర్, టార్న్‌టరన్‌లలో కూడా డ్రోన్‌దాడులకు దిగింది. ఫి రోజ్‌పూర్‌లోని జనావాసాలను డ్రోన్లు టార్గెట్ చేసుకున్నాయి.ఈ ఘటన లో ఓ కుటుంబానికి తీవ్ర గాయాలైనట్లు తెలిసింది. జమ్మూలో రెండు భారీ పేలుడు శబ్దాలు వినిపించాయి. దీంతో పెద్ద ఎత్తున సైరన్ల మోత మోగింది. ఈ విషయాన్ని ఆ రాష్ట్ర సిఎం ఒమర్ అబ్దుల్లా కూడా ధ్రువీకరించారు. స్థానిక మసీదుల్లోని మైక్‌లను ఉపయోగించి ఇళ్లలోని లైట్లను ఆపాలని అధికారులు ప్రజలకు సూచించారు. వెంటనే జమ్మూ వ్యాప్తంగా బ్లాక్‌ఔట్ పాటించడంతో పట్టణం మొత్తం చీకట్లు అలుముకున్నాయి. సంబంధిత చిత్రాలను సిఎం తన ఎక్స్ ఖాతాలో పోస్ట్ చేశారు. ఉధంపూర్‌లో పూర్తిగా బ్లాక్‌ఔట్ పాటించారు. అఖ్నూర్, సాంబా, పూంచ్ సెక్టార్‌లో పాక్ వైపు నుంచి కాల్పుల మోత మోగింది. ఎల్‌వోసి వెంట కాల్పుల శబ్దాలతో పాటు పేలుళ్లు జరిగినట్లు తెలిసింది. యూరీ, రాజౌరి సరిహద్దుల్లోని నివాసాలను పాక్ సేనలు లక్షంగా ఎంచుకుని కాల్పులకుదిగాయి. హర్యానాలోని పంచకులా, అంబాలోనూ బ్లాక్ ఔట్ పాటించారు.



# అసమాన నృత్యకళాకారిణి

ప్రముఖ నృత్య కళాకారిణి, పద్మ భూషణ్ పురస్కార గ్రహీత మృణాళినీ సారాభాయ్ పేరు శాస్త్రీయ నృత్య రంగంలో ఎరుగని వారు అరుదు. శాంతినికేతన్లో గురు రవీంద్రనాథ్ ఠాగూర్ దగ్గర విద్యాభ్యాసం చేసిన మృణాళిని భరత నాట్యం, మోహినీ యాట్టం, కథాకళి నాట్య రీతులలో శిక్షణ పొందారు. నాట్యకారిణిగానే కాదు, కవయిత్రిగా, రచయితగా, నృత్య దర్శకురాలిగా ఆమె ఖ్యాతి పొందారు. మృణాళినికి భరతనాట్యం పంచ ప్రాణం. నాట్యమే సర్వస్వం. నాట్యం కోసం జీవితంలో అసలు పెళ్లే చేసుకో కూడదని అనుకున్నారు. ఆమె కుటుంబానికి సన్నిహితులైన పరమాణు శాస్త్రవేత్త హెూమీ జహంగీర్ భాభానే ... మరో శాస్త్రవేత్త విక్రమ్ సారాభాయ్‌ని మృణాళినికి పరిచయం చేశారు. విక్రమ్ ఆమెను కలిసిన తర్వాత ఆమె కూడా మారారు. తర్వాత... మృణాళిని విక్రమ్ పెళ్లి చేసుకున్నారు. మృణాళిని సారాభాయ్ (1918 మే 11 – 2016 జనవరి 20) భారతీయ సాంప్రదాయ నృత్య కళాకారిణి, నృత్య దర్శకురాలు, నృత్య గురువు. ఆమె "దర్పణ అకాడమీ ఆఫ్ పెర్‌ఫార్మింగ్ ఆర్ట్స్"కు వ్యవస్థాపకురాలు. అహ్మదాబాదు లోని ఈ సంస్థలో నృత్య రీతులు, నాటకాలు, సంగీతం, తోలుబొమ్మపాటలపై శిక్షణ ఇవ్వడం జరుగుతుంది. ఆమె 18,000 మంది శిష్యులకు భరత నాట్యం, కథాకళి లలో శిక్షణ ఇవ్వడం సామాన్యమైన విషయం కాదు. మృణాళిని కేరళ లోని మాజీ పార్లమెంట్ సభ్యులు, సామాజిక కార్యకర్త అయిన అమ్ము స్వామినాథన్ కుమార్తె. ఆమె బాల్యం స్విడ్జర్లాండ్ లో గడిచింది. ఆమె "డాల్‌క్రోజ్" పాఠశాలలో తొలి పాఠాలుగా పశ్చిమాది నృత్య భంగిమలను నేర్చుకున్నారు...ఆమె శాంతి నికేతన్‌లో రవీంధ్ర నాథ్ ఠాగూర్ మార్గదర్శకత్వంలో విద్యాభ్యాసం చేశారు. అక్కడ జీవిత యదార్థాలను గ్రహించే అవకాశాలు కలిగాయి. తర్వాత ఆమె కొంతకాలం అమెరికా సంయుక్త రాష్ట్రాలకు వెళ్ళి... అమెరికన్ అకాడమీ ఆఫ్ ఫ్రెంచ్ ఆర్చివ్స్ ఇంటర్నేషనలాలిస్ డి లా డాన్సె నుండి డిప్లొమాడ్రామాటిక్ ఆర్ట్స్ లో చేరారు. తర్వాత భారత దేశానికి వచ్చి ఆమె దక్షిణాది సాంప్రదాయక నృత్యం అయిన భరతనాట్యాన్ని "మీనాక్షి సుందరంపిళ్ళై" ద్వారా, కథాకళి నృత్యాన్ని "తకఘి కుంచు కురూప్" ద్వారా శిక్షణ పొందారు.మృణాళిని 1948 లో దర్పణ అనే సంస్థను స్థాపించారు. ఒక సంవత్సరం తరువాత పారిస్ లో "థియేటర్ నేషనల్ డి చైల్లోట్" లో ప్రదర్శన ఇచ్చారు. మృణాళిని సుమారు మూడు వందలకు పైగా నాటకాలకు దర్శకత్వం వహించారు. ఆమె అనేక నవలలు, కవితలు, నాటకాలు, కథలు పిల్లల కోసం రచించారు. ఆమె గుజరాత్ రాష్ట్ర హాండీక్రాఫ్ట్స్ అండ్ హాండ్ లూం డెవలప్ మెంట్ సంస్థకు ఛైర్‌పర్సన్ గా, గాంధీ ఆశయాల ప్రోత్సాహం కోసం యేర్పడిన, సర్వోదయ ఇంటర్నేషనల్ ట్రస్ట్‌కు ఆమె ఒక ట్రస్టీగా కూడా ఉన్నారు. మృణాళిని సారాభాయ్ 1965లో పద్మశ్రీ, 1992 లో భారతదేశ విశిష్ట పురస్కారం పద్మభూషణ అవార్డును అందుకున్నారు. 1997 లో యు.కె లోని న్యూయాచ్ కు చెందిన అంగిలియా విశ్వ విద్యాలయం ఆమెకు గౌరవ డాక్టరేట్ ను ప్రదానం చేసింది. ఫ్రెంచ్ ఆర్చివ్స్ ఇంటర్నేషనలాలిస్ డి లా డాన్సె నుండి డిప్లొమా, మెడల్ అందుకున్న మొదటి వ్యక్తిగా చరిత్రలో నిలిచారు. 1990 లో పారిస్ లోని ఇంటర్నేషనల్ డాన్స్ కౌన్సిల్ లో ఎగ్జిక్యూటివ్ కమిటీలో నామినేట్ చేయ బడ్డారు. 1994 లో న్యూఢిల్లీ లో సంగీత నాటక అకాడమీ పురస్కారాన్ని అందుకున్నారు. మెక్సికో ప్రభుత్వం నుండి బంగారు పతకాన్ని పొందారు. సాంప్రదాయిక నృత్య రంగంలో "మృణాళినీ సారాభాయ్ అవార్డ్ ఫర్ క్లాసికల్ ఎక్స్‌లెన్స్" అవార్డును ప్రకటించింది. 2013లో కేరళ ప్రభుత్వ వార్షిక పురస్కారమైన నిషాగంధి పురస్కారానికి ఆమె మొదటి గ్రహీత. మృణాళిని కుటుంబీకులు పేరు మోసిన వారు కావడం విశేషం. ఆమె తండ్రి డా.స్వామినాథన్ మద్రాసు హైకోర్టులో పేరు పొందిన బారిష్టరు. మద్రాసు లా కాలేజీలో ప్రిన్సిపాల్‌గా పని చేశారు. అమె తల్లి అమ్ము స్వామినాథన్ ప్రముఖ స్వాతంత్ర్య సమర యోధురాలు. మాజీ ఎం.పీ. మృణాళిని సోదరి డా. లక్ష్మీ సెహగల్, నేతాజీ సుభాష్ చంద్రబోస్ స్థాపించిన ఆజాద్ హింద్ ఫౌజ్ లోని "రాణి ఆఫ్ ఝాన్సి రెజిమెంట్" విభాగానికి కమాండర్ గా ఉండేది. ఆమె సోదరుడు "గోవింద స్వామినాథన్" మద్రాసు హైకోర్టులో పేరుమోసిన న్యాయవాది. ఆయన మద్రాసు రాష్ట్ర (తమిళనాడు) కు అటార్నీ జనరల్ బాధ్యతలు కూడా నిర్వహించారు. మృణాళిని భర్త భారతీయ భౌతిక శాస్త్రవేత్త విక్రం సారాభాయ్ కాగా, భారతీయ అంతరిక్ష కార్యక్రమ పిత విక్రం సారాభాయ్ తన భార్యకు తన కెరీర్ ను పెంపొందించు కునేందుకు సంపూర్ణ స్వాతంత్ర్యం ఇచ్చారు. వారికి ఒక కుమారుడు కార్తికేయ సారాభాయ్, ఒక కుమార్తె మల్లికా సారాభాయ్ ఉన్నారు. కుమార్తె మల్లిక కూడా నృత్య కళాకారిణియే. మృణాళిని అహ్మదాబాద్ లోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ 2016, జనవరి 21న మరణించారు.

# అమృత్‌సర్‌లో పాక్ డ్రోన్ల కూల్చివేత..

అమృత్‌సర్ : భారత్‌లోని సరిహద్దు ప్రాంతాలను లక్ష్యంగా చేసుకొని పాకిస్థాన్ డ్రోన్ దాడులకు తెగబడుతోన్న విషయం తెలిసిందే. శనివారం తెల్లవారుజామున అమృత్‌సర్‌లోని ఖాసా కంటోన్మెంట్ గగనతలంలో భద్రతా బలగాలు పాకిస్తాన్ డ్రోన్‌ను గుర్తించి కూల్చివేశాయి. దీనికి సంబంధించిన వీడియోను, చిత్రాలను సోషల్ మీడియాలో షేర్ చేశారు. అలాగే చండీగఢ్‌లోనూ తెల్లవారుజామున దాడులు జరిగినట్లు అధికారులు పేర్కొన్నారు. పఠాన్‌కోట్‌లో ఉదయం 5 గంటలకు భారీ పేలుళ్ల శబ్దాలు వచ్చినట్లు తెలిపారు. జమ్మూ నుంచి గుజరాత్ వరకు పలుచోట్ల పాక్ దాడులకు పాల్పడగా.. భారత సైన్యం వాటిని సమర్థంగా తిప్పికొట్టినట్లు తెలిపారు. శ్రీనగర్ విమానాశ్రయం, ఎయిర్ బేస్ పైనా డ్రోన్లతో దాడికి పాక్ డ్రోన్లతో దాడికి యత్నించినట్లు తెలుస్తోంది.

# పాత్రలలో మాధవపెద్ది స్వరం పరకాయ ప్రవేశం

"వివాహ భోజనంబు వింతైన వంటకంబు, వియ్యాల వారి విందు, ఒహ్హోహ్హో నాకే ముందు" అనే అలనాటి మల్టీ స్టారర్ చిత్రరాజం మాయా బజార్ చిత్రంలోని పాటను వినని తెలుగు వారుండరంటే అతిశయోక్తి కాదేమో. ఆ పాట గుర్తుకు రాగానే వెను వెంటనే కళ్ళ ముందు కదలాడతూనే రూపం ఎస్వీ రంగారావుది. ఆ వెంటనే స్ఫురణకు వచ్చేది మాధవపెద్ది గాత్రమే. ఎస్వీఆర్ నటనకు జీవం పోసిన నేపథ్య గాయకుడు మాధవపెద్ది. అంతేకాదు, దుర్యోధనుడు, రావణుడు, ఘటోత్కచుడు ఇలా ప్రతినాయక పాత్రలకు నేపథ్య గానం ఆయనదే. ఎస్వీరంగారావు, రేలంగి, రమణారెడ్డి లాంటి నాయకేతర నటుల నటనలతో ఆయన గొంతు మమేకం అయింది. మాధవపెద్దిది సుస్వరం. వివాహ భోజనంబు' అని తినుబండారాల గురించి వర్ణించినా, సరదా సరదా సిగరెట్టు' అని ధూమపానం అనర్థాల గురించి హెచ్చరించినా, అయయో జేబులో డబ్బులు పోయెనే' అంటూ పేకాట గురించి వాపోయినా, భళి భళి భళి భళి' దేవా అంటూ తత్వాన్ని బోధించినా, భలేచాన్సులే' అంటూ ఇల్లరికంలో ఉన్న మజాను తెలిపినా, మాధవపెద్ది సుస్పష్ట స్వరం చెవులలో ఇంపుగా వినిపిస్తుంది. అపస్వరమే తెలియని గాయకుడు మా బాబాయ్' అని మాధవపెద్ది గురించి గాన గంధర్వుడు ఎస్పీ. బాలు అంటుండే వారు. మాధవపెద్ది సత్యం (మార్చి 11, 1922 – డిసెంబర్ 18, 2000) తెలుగు సినిమా నేపథ్య గాయకుడు, రంగస్థల నటుడు. ఈయన తెలుగు, తమిళం, కన్నడ, మళయాళం, హిందీ, సింహళ భాషలతో సహా దాదాపు అన్ని భారతీయ భాషలలో 7,000 పైగా పాటలు పాడి ప్రసిద్ధి చెందాడు. సత్యం 1922, మార్చి 11 న బాపట్ల సమీపాన బ్రాహ్మణ కోడూరు గ్రామంలో మాధవపెద్ది లక్ష్మీ నరసయ్య, సుందరమ్మ దంపతులకు జన్మించాడు. వృత్తిరీత్యా నటుడైన సత్యం చిన్నతనములో ఎనిమిదేళ్ల వయసునుండి రంగస్థల నాటకాలలో నటించేవాడు. తెలుగు రంగ స్థలముపై మల్లాది సూర్య నారాయణ నాటక బృందములో సభ్యునిగా హరిశ్చంద్ర నాటకములో నక్షత్రకుని పాత్రను అద్భుతము పోషిస్తూ పేరు తెచ్చుకున్నాడు. ఆయన ప్రతిభను గుర్తించిన చక్రపాణి మాధవపెద్దిని తనతోపాటు మద్రాసు తీసుకువెళ్లి, తను నాగిరెడ్డితో కలిసి అప్పుడే కొత్తగా స్థాపించబడిన విజయా పిక్చర్స్ పతాకము కింద నిర్మిస్తున్న షావుకారు చిత్రములో నటించే అవకాశము కలుగ జేశాడు. ఈయన తొలిసారిగా వెండితెరపై హిందీ, తమిళ ద్విభాషాచిత్రం రామదాసులో కనిపించాడు. ఆ సినిమాకు రెండు భాషల్లోనూ తన పాత్రర పాటలు తనే స్వయంగా పాడాడు. మాధవపెద్ది సత్యం షావుకారు సినిమాతో తెలుగు సినిమా రంగములో అడుగు పెట్టాడు. ఈ సినిమాలో సత్యం ఒక గుడ్డివాని పాత్రపోషించి ఆ పాత్రకు ఉన్న మూడు పాటలు పాడాడు. కొన్ని తెలుగు చిత్రాలలో నటించినా మాధవపెద్ది సత్యం ప్రధానంగా గాయకుడే. ఆయన ఆనాటి ప్రసిద్ధ సంగీత దర్శకులైన సాలూరు రాజేశ్వరరావు, ఘంటసాల వెంకటేశ్వరరావు తదితరు లందరితో పనిచేశాడు. ఎస్వీ రంగారావు, రేలంగి వెంకట రాయయ్య పాటలన్నీ దాదాపు ఆయనే పాడాడు. పౌరాణిక చిత్రాలలో పద్యాలు పాడటములో పేరెన్నిక గన్నాడు. ముఖ్యంగా పిఠాపురం నాగేశ్వరరావు, మాధవపెద్ది సత్యం జోడి కలిసి పాడిన పాటలు తెలుగు వారి నొళ్ళలో ఇప్పటికి నానుతూనే ఉన్నాయి.75 ఏళ్ళ వయసులో కూడా కృష్ణవంశీ తీసిన సింధూరం సినిమాలో సంకురాతిరి పండగొచ్చెరో పాటపాడి పలువురి ప్రశంసలందు కున్నాడు. ఇలా ఎందఱో నటులకు ఆయన కంఠం అమరి పోయింది. రంగస్థల అనుభవం ఆయన్ని తీర్చిదిద్దింది. పద్యం ఆయన గళంలో వయ్యారాలు ఒలికించు కుంది. పాట ఆయన గొంతులో ఒదిగి పోయింది. పాడుతున్నది పాత్రలేమో, పాత్రదారులేమో అనిపించేలా పాత్రలలో ఆయన స్వరం పరకాయ ప్రవేశం చేస్తుంది.ఆయన పద్యంలో భావం తొణికిస లాడుతుంది. ఆయన పాటలో రాగం అలవోకగా అమరి పోతుంది.ఆయన కంఠంలో గాంభీర్యం నాట్య మాడుతుంది. ఆయన కంఠంలో హాస్యం గిలిగింతలు పెడుతుంది. తనకు వచ్చిన గౌరవ పురస్కారాలను ఎప్పుడూ ప్రదర్శించు కోలేదు. కారు కూడా ఎక్కేవారు కాదు. రైలులో సెకండ్ క్లాసులోనే ప్రయాణించే వాడు. మాయాబజార్‌లో నాన్న పాడిన 'వివాహ భోజనంబు' పాట 'సాంగ్ ఆఫ్ ద మిలీనియమ్'గా ఎంపికయినా ఏ మాత్రం గర్వించలేదు. ఆయన సినిమా పరిశ్రమలో యాభై ఏళ్లకు పైగా ఉన్నప్పటికీ విజిటింగ్ కార్డు కూడా ఉండేది కాదు. ఆయన 78 సంవత్సరాల వయసులో 2000, డిసెంబర్ 18న చెన్నైలో అస్వస్థతతో మరణించాడు. ఆయన కుమారుడు, కూచిపూడి నృత్య కోవిదుడు మాధవపెద్ది మూర్తి తన తల్లితండ్రుల జ్ఞాపకార్థం ' మాధవపెద్ది సత్యం అవార్డు, మాధవపెద్ది ప్రభావతి అవార్డును ' నెలకొల్పారు. ఆ పురస్కారం అందుకొన్న వారిలో ఎం. ఎస్. విశ్వనాథన్, పి. బి. శ్రీనివాస్ లాంటి ప్రముఖులున్నారు.

# డిఫెన్స్ యాక్ట్ పరిధిలో రాష్ట్రాల చర్యలు

న్యూఢిల్లీ : పాకిస్థాన్‌తో ఇప్పటి ఘర్షణల నేపథ్యంలో శుక్రవారం కేంద్ర హెూం మంత్రిత్వశాఖ అన్ని రాష్ట్రాలూ , కేంద్రపాలిత ప్రాంతాలకు కీలక మార్గదర్శకాలు వెలువరించింది. యుద్ధం లేదా సంఘర్షణల దశల్లో పౌరుల భద్రతకు తీసుకోవల్సిన చర్యలను ఈ చట్టంలో పొందుపర్చి ఉంచారు. ఈ సివిల్ డిఫెన్స్ యాక్ట్ లోని నిబంధనల మేరకు రాష్ట్రాలు పౌరుల భద్రతా చర్యలు చేపట్టాల్సిన బాధ్యతలు నిర్వర్తించాల్సి ఉంటుంది. దీనికి 1968 నాటి సంబంధిత యాక్ట్‌ను ప్రామాణికంగా తీసుకుని తీరాలి. అత్యవసర జాతీయ భద్రత విపత్కర పరిస్థితుల దశలో రాష్ట్రాలు తమ ప్రాంత పరిస్థితులను బట్టి వెంట వెంట తగు చర్యలు తీసుకునేందుకు రాష్ట్రాలు తగు అధికారం సంతరించుకుంటాయి. ప్రజల ఆస్తులు, ప్రాణాలు కాపాడటం, జాతీయ కీలక సంస్థల స్థావరాల రక్షణ, సరైన భద్రత వంటి వాటి కోసం ఈ చట్టం పరిధిలో రాష్ట్రాలు వెంటనే రంగంలోకి దిగే అవకాశం ఉంటుంది. నిద్రాణంగా ఉండే ఈ యాక్ట్‌ను ఇటువంటి ఘర్షణలు , యుద్ధం సమయంలో తిరిగి వాడుకునేందుకు వీలుంటుంది. దీనిని రాష్ట్రాలు, యుటిలకు ఇప్పుడు కేంద్రం సరైన విధంగా గుర్తు చేసింది. జాతీయ ప్రయోజనాల కేంద్రీకృత సంస్థల రక్షణ , పౌరుల భద్రతకు ఈ ప్రత్యేక యాక్ట్ ద్వారా వీలుంటుంది. కేంద్రానికి సరైన సమాచారం ద్వారా యాక్ట్ నిబంధనలను పాటిస్తూ రాష్ట్రాలు వెనువెంటనే తక్షణ చర్యలకు దిగడం ద్వారా అవాంఛనీయ ఘటనలు తలెత్తకుండా చూసుకునేందుకు వీలుంటుంది.

# మే 15 వరకు పౌర విమానాల రాకపోకలపై ఆంక్షలు..



ఆపరేషన్ సిందూర్ కింద పాకిస్తాన్‌పై కొనసాగుతున్న చర్యల మధ్య భారత ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది . దేశవ్యాప్తంగా 32 విమానాశ్రయాలను గురువారం (మే 15) ఉదయం 5:29 గంటల వరకు మూసివేయాలని కేంద్ర ప్రభుత్వం ఆదేశించింది. పాకిస్తాన్ చేస్తున్న క్షిపణి, డ్రోన్ దాడులను దృష్టిలో ఉంచుకుని ఈ నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొంది. ఆపరేషన్ సిందూర్ కింద పాకిస్తాన్‌పై కొనసాగుతున్న చర్యల మధ్య భారత ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది . దేశవ్యాప్తంగా 32 విమానాశ్రయాలను గురువారం (మే 15) ఉదయం 5:29 గంటల వరకు మూసివేయాలని కేంద్ర ప్రభుత్వం ఆదేశించింది. పాకిస్తాన్ చేస్తున్న క్షిపణి, డ్రోన్ దాడులను దృష్టిలో ఉంచుకుని ఈ నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొంది. అయితే, దేశవ్యాప్తంగా 24 విమానాశ్రయాలలో విమాన కార్యకలాపాలు శనివారం (మే 10) వరకు మూసివేస్తున్నట్లు పౌర విమానయాన మంత్రిత్వ శాఖ గురువారం (మే 8) ప్రకటించింది. కానీ పాకిస్తాన్ నుండి నిరంతర దాడులు జరిగిన తరువాత, కేంద్ర ప్రభుత్వం తేదీని పొడిగిస్తూ నిర్ణయం తీసుకుంది. మే 15 వరకు కేంద్ర ప్రభుత్వం మూసివేయాలని నిర్ణయించిన 24 విమానాశ్రయాలలో చండీగఢ్, శ్రీనగర్, అమృత్సర్, లూధియానా, భుంటార్, కిషన్‌గఢ్, పాటియాలా, సిమ్లా, జైసల్మేర్, పఠాన్‌కోట్, జమ్మూ, బికనీర్, లేహ్, పోర్‌బందర్ సహా అనేక ఇతర విమానాశ్రయాలు ఉన్నాయి. ఈ విమానాశ్రయాలన్నీ భారతదేశం-పాకిస్తాన్ సరిహద్దుకు సమీపంలో ఉన్న నగరాల్లో ఉన్నాయి. ప్రస్తుత పరిస్థితిలో, భద్రత దృష్ట్యా ఇవన్నీ మూసివేయడం జరుగుతుందని కేంద్ర ప్రభుత్వం తెలిపింది. భారతదేశం-పాకిస్తాన్ మధ్య కొనసాగుతున్న వివాదం దృష్ట్యా, అనేక విమానయాన సంస్థలు ప్రయాణీకులకు ప్రయాణ సలహాను జారీ చేశాయి. విమానాశ్రయ మూసివేతలు, పెరిగిన భద్రతా ప్రోటోకాల్‌ల గురించి ప్రయాణీకులు తమను తాము అప్‌డేట్ చేసుకోవాలని కోరుతూ కంపెనీలు సలహాలు జారీ చేశాయి. ఎయిర్ ఇండియా శుక్రవారం (మే 9) సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ ఎ పోస్ట్‌ను షేర్ చేసింది. "విమానయాన అధికారులు జారీ చేసిన నోటిఫికేషన్ ప్రకారం, దేశవ్యాప్తంగా అనేక విమానాశ్రయాల మూసివేత ప్రస్తుతానికి కొనసాగుతుంది. ఇంతలో, జమ్మూ, శ్రీనగర్, లేహ్, జోధ్‌పూర్, అమృత్సర్, చండీగఢ్, భుజ్, జామ్‌నగర్, రాజ్‌కోట్‌లకు బయలుదేరే అన్ని విమానాలు గురువారం (మే 15) ఉదయం 5:29 గంటల వరకు రద్దు చేయబడ్డాయి" అని ఎయిర్‌లైన్ కంపెనీ పోస్ట్‌లో రాసింది. "ప్రస్తుత సమయంలో, ప్రయాణానికి చెల్లుబాటు అయ్యే టిక్కెట్లను కలిగి ఉన్న వినియోగదారులందరికీ ప్రయాణ మార్పు లేదా టికెట్ రద్దుపై పూర్తి వాపసు విషయంలో ధరపై ఒకేసారి తగ్గింపు ఇవ్వడం జరుగుతుంది" అని కంపెనీ పేర్కొంది.

## పాకిస్థాన్‌లో చమురు సంక్షోభం.. రాజధానిలో పెట్రోల్ బంకులు క్లోజ్..




భారత్ దాడితో కుదేలవుతున్న పాక్‌ను ఇప్పుడు చమురు కొరత వేధిస్తోంది. ఇస్లామాబాద్ రాజధాని టెరిటరీ అడ్మినిస్ట్రేషన్ రాజధాని నగరంలోని అన్ని పెట్రోల్, డీజిల్ ఫిల్లింగ్ స్టేషన్లను రాబోయే 48 గంటల పాటు పూర్తిగా మూసివేయాలని తక్షణ ఉత్తర్వు జారీ చేసింది. భారత వైమానిక దాడులతో ఉక్కిరిబిక్కిరి అవుతోన్న పాక్‌కు మరో సంక్షోభం వచ్చిపడింది. భారత్ దాడితో కుదేలవుతున్న పాక్‌ను ఇప్పుడు చమురు కొరత వేధిస్తోంది. ఇస్లామాబాద్ రాజధాని టెరిటరీ అడ్మినిస్ట్రేషన్ రాజధాని నగరంలోని అన్ని పెట్రోల్, డీజిల్ ఫిల్లింగ్ స్టేషన్లను రాబోయే 48 గంటల పాటు పూర్తిగా మూసివేయాలని తక్షణ ఉత్తర్వు జారీ చేసింది. శనివారం ఉదయం 6 గంటల నుంచి 48 గంటల పాటు ఇస్లామాబాద్‌లోని అన్ని పెట్రోల్ బంకులను మూసివేస్తున్నట్టుగా అక్కడి ప్రభుత్వం ప్రకటించింది. అయితే, పెట్రోల్ బంకులు మూసి వేయడానికి గల కారణాలు ఏంటనే విషయంపై స్పష్టమైన వివరాలు మాత్రం తెలిసి రాలేదు. కాగా, పాక్‌లోని 4 ఎయిర్ బేస్‌లపై భారత్ దాడి చేసింది. దీంతో ఇరుదేశాల మధ్య ఉద్రిక్తతలు తీవ్రతరమయ్యాయి.

## పాకిస్తాన్‌కు అంతర్జాతీయ రుణ సంస్థల నుంచి భారీగా అప్పు..!

గతంలో తీసుకున్న అప్పులను పాక్ సక్రమంగా వినియోగించులేదని ఆరోపించింది. ఐఎంఎఫ్ నుంచి నిధులు వస్తూ ఉంటే.. పాక్ వాటిని సైన్యానికి, ప్రభుత్వ ప్రాయోజిత సీమాంతర ఉగ్రవాదుల కోసం వినియోగిస్తుందని భారత్ ధ్వజమెత్తింది. ఆ నిధులను పాక్ సక్రమంగా వినియోగించి ఉంటే ఆ దేశ ఆర్థిక వ్యవస్థ స్థిరంగా ఉండేదని చెప్పుకొచ్చింది భారత్. అంతర్జాతీయ ద్రవ్య నిధి ఎక్స్‌టెండెడ్ ఫండ్ ఫెసిలిటీ (×వీఫ్) చివరకు పాకిస్తాన్‌కు రుణం ఇచ్చేందుక అంగీకరించింది. 1 బిలియన్ డాలర్ల(మన కరెన్సీలో దాదాపు రూ.8540 కోట్లు.)అదే పాకిస్థాన్ కరెన్సీలో దాదాపు రూ.28 వేల కోట్ల రుణం అందించడానికి అంగీకరించింది. ఐఎంఎఫ్ పాకిస్తాన్‌కు రుణాలు అందించటంపై భారత్ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. రుణ ప్రతిపాదనను ఓటింగ్‌కు ఉంచినప్పుడు భారతదేశం మాత్రమే ఆ ఓటింగ్‌కు దూరంగా ఉంది. ఐఎంఎఫ్ నిర్ణయాన్ని వ్యతిరేకించడానికే భారతదేశం ఈ నిర్ణయం తీసుకుందని ప్రభుత్వ వర్గాలు పేర్కొంటున్నాయి. పాకిస్థాన్‌కు ఐఎంఎఫ్ కింద ఇవ్వదలచిన 700 కోట్ల డాలర్లలో 100 కోట్ల డాలర్ల విడుదల, కొత్త అప్పు కింద మరో 130 కోట్ల డాలర్లు.. మొత్తం కలిపి 230 కోట్ల డాలర్ల రుణం ఇచ్చే ప్రతిపాదనలను పరిశీలించేందుకు ఐఎంఎఫ్ శుక్రవారం బోర్డు మీటింగ్ నిర్వహించింది. కానీ, పాక్ అప్పు ఇచ్చే విషయంలో ఓటింగ్‌కు దూరంగా ఉండటం ద్వారా భారతదేశం తీవ్ర అసమ్మతిని వ్యక్తం చేసింది. అధికారికంగా తీవ్ర అభ్యంతరాలను వ్యక్తం చేసింది. గత35 ఏళ్లలో 28 సార్లు పాక్ అంతర్జాతీయ ద్రవ్యనిధి నుంచి రుణాలు తీసుకుందని, గడిచిన ఐదేళ్లలో నాలుగు ఐఎంఎఫ్ ప్రోగ్రామ్‌లు పాక్‌లో అమలయ్యాయని గుర్తుచేసింది. కానీ, ఆ రుణాలు ఇచ్చే సమయంలో ఐఎంఎఫ్ పెట్టే షరతులకు కట్టుబడి ఉండడంలో, వాటిని అమలు చేయడంలో మాత్రం పాక్‌కు ఎప్పుడు కట్టుబడి లేదని, ఈ విషయాల్లో పాక్‌కు ఎక్కడా మంచి రికార్డు లేదని భారత్ ధ్వజమెత్తింది. గతంలో తీసుకున్న అప్పులను పాక్ సక్రమంగా వినియోగించులేదని ఆరోపించింది. ఐఎంఎఫ్ నుంచి నిధులు వస్తూ ఉంటే.. పాక్ వాటిని సైన్యానికి, ప్రభుత్వ ప్రాయోజిత సీమాంతర ఉగ్రవాదుల కోసం వినియోగిస్తుందని భారత్ ధ్వజమెత్తింది. ఆ నిధులను పాక్ సక్రమంగా వినియోగించి ఉంటే ఆ దేశ ఆర్థిక వ్యవస్థ స్థిరంగా ఉండేదని చెప్పుకొచ్చింది భారత్.




## వ్యాపారంలో విజయానికి పంచతంత్రం.. వారెన్ బఫెట్ చెప్పిన ఐదు సూత్రాలు




ప్రతి ఒక్కరూ తాము ఉన్నత స్థాయికి ఎదగాలని, డబ్బులు బాగా సంపాదించాలని, వ్యాపారంలో ప్రగతి సాధించాలని కోరుకుంటారు. ఆ లక్ష్యాలను నెరవేర్చుకోవడానికి రేయింబవళ్లు కష్టబడతారు. వారిలో కొందరు విజయతీరాలకు చేరుకుంటారు. మరికొందరు మధ్యలోనే ఆగిపోతారు. ఏదైనా అనుకున్న లక్ష్యాన్ని చేరుకోవడానికి క్రమశిక్షణ, ఓర్పు, సహనం, ముందు చూపు అవసరం. మన కళ్ల ముందే విజయాలు సాధించిన వ్యక్తులు మనకు ఆదర్శంగా నిలుస్తారు. వారిలో అమెరికాకు చెందిన వ్యాపారవేత్త వారెన్ బఫెట్ ఒకరు. ఆయన పెట్టుబడి దారుడు, పరోపకారి, బెర్క్ షైర్ హాత్ వే కంపెనీ చైర్మన్. ప్రపంచంలోని అత్యంత ధనవంతుల్లో ఒకరు. మంచి పెట్టుబడులు పెట్టాలంటే తెలుసుకోవాల్సిన ఐదు విషయాలను ఆయన వెల్లడించారు. మూలధనాన్ని రక్షించుకోవడం పెట్టుబడిదారుల ప్రధాన బాధ్యతని బఫెట్ తెలిపారు. డబ్బును పోగొట్టుకుంటే మీరు రేసులో వెనుకబడిపోతారు. దాని నుంచి కోలుకోవడం కష్టంగా మారుతుంది. ఒక స్టాక్ లో 50 శాతం నష్టపోతే, మరో దానిలో లాభాలు సంపాదించాలి. ముఖ్యంగా పెట్టుబడిలో నష్టాలను నివారించడానికి కష్టబడి పనిచేయడమే సరైన మార్గమని ఆయన నమ్మకం. ఎక్కువ డబ్బులు పెట్టి ఒక మంచి కంపెనీని కొనడం కంటే, తక్కువ డబ్బులతో మధ్యస్త కంపెనీ కొనడం ఉత్తమమని బఫెట్ చెబుతారు. దీని వల్ల తక్కువ ధరకు నాణ్యత కలిగిన కంపెనీలో పెట్టుబడి పెట్టే అవకాశం కలుగుతుంది. ఇది వ్యాపార రంగంలో పెద్ద మార్పును తీసుకువస్తుంది. దీర్ఘకాలంలో లాభాల బాటలో పయనించే అవకాశం కలుగుతుంది. భావోద్వేగాలను దూరంగా ఉండడం పెట్టుబడి దారుడి ప్రధాన లక్షణం. దీనినే బఫెట్ వ్యతిరేక పెట్టుబడి కళగా అభివర్ణించారు. మార్కెట్ బాగున్నప్పుడు ధరలు పెరుగుతాయి. దీని వల్ల నష్టాలు కలుగుతాయి. అయితే భయాందోళనలు తలెత్తినప్పుడు స్టాక్ ల ధరల తగ్గే అవకాశం ఉంది. ఆ సమయంలో మంచి డీల్ లను అందుకోవచ్చు. పెట్టుబడిదారుడికి ఓర్పు అనేది చ్హాలా అవసరం. పెట్టుబడి పెట్టిన వెంటనే లాభాల కోసం ఆలోచించడం సరి కాదు. మంచి కంపెనీలో ఏళ్ల తరబడి డబ్బులను నిల్వ ఉంచాలి. అసహనంగా ఉండే వారు తరచూ అధిక ధరలకు స్టాక్ లను కొనుగోలు చేసి, మార్కెట్లు పెరిగినప్పుడు తక్కువ ధరకు అమ్మేస్తారు. తద్వారా ఓపికతో వేచి ఉండే ఇన్వెస్టర్లు లాభాలు పొందుతారు. డబ్బులను సంపాదించడానికి నిరంతరం కొత్త మార్గాలను అన్వేషించాలి. ఒక రకంగా చెప్పాలంటే నిద్ర పోతున్నప్పుడు కూడా డబ్బు సంపాదించడానికి మార్గం ఆలోచించాలి. లేకపోతే మీరు చనిపోయే వరకూ పని చేస్తూనే ఉంటారని వారెన్ బఫెట్ చెప్పారు. అంటే స్టాక్ లు, డివిడెంట్లు, మ్యూచువల్ ఫండ్స్ లో డబ్బులను ఇన్వెస్ట్ చేయాలి. మీరు నిద్రపోతున్నప్పుడు కూడా అవి పెరుగుతూనే ఉంటాయి. కొత్త మార్గాలను అన్వేషించడం పెట్టుబడి దారుడికి చాలా అవసరం.

## ఎఫ్ఎంసిజి అమ్మకాల్లో మందగమనం

రోజువారి అవసరాల కోసం అత్యంత ఎక్కువగా ఉపయోగించే ఎఫ్ఎంసిజి అమ్మకాలు మందగించాయి. ప్రస్తుత ఏడాది మార్చితో ముగిసిన త్రైమాసికంలో వీటి విక్రయాలు ఏకంగా 5.1 శాతం క్షీణించాయని నీల్సన్ఐక్యూ ఓ రిపోర్ట్‌లో వెల్లడించింది. పానియాలు, కస్మోటిక్స్, ప్యాకేజింగ్ ఫుడ్, క్లీనింగ్ ఉత్పత్తులు, పెన్నులు, పెన్సిళ్లు తదితర ఉత్పత్తులు ఎఫ్ఎంసిజి రంగంలోకి వస్తాయి. తక్కువ విలువ కలిగి ఎక్కువగా అమ్ముడయ్యే ఈ ఉత్పత్తుల అమ్మకాలు 2024 ఇదే మార్చి త్రైమాసికంలో 6.1 శాతం వృద్ధిని సాధించాయి. గడిచిన ఐదు త్రైమాసికాల నుంచి వీటి వృద్ధి సన్నగిల్లిందని నీల్సన్ రిపోర్ట్ పేర్కొంది. గ్రామీణ మార్కెట్ పట్టణ మార్కెట్ కంటే వేగంగా వద్ధి చెందుతూనే ఉంది. ఈ మార్కెట్ పట్టణాల కంటే గ్రామీణంలో ఎక్కువగా పెరుగుతున్నప్పటికీ గ్రామీణ ప్రాంతాల్లోనూ అమ్మకాలు అంతంత మాత్రంగానే నమోదయ్యాయి. "2024 తొలి త్రైమాసికంలోని డిమాండ్‌తో పోల్చితే 2025 ప్రథమ త్రైమాసికంలో గ్రామీణ వినియోగదారుల డిమాండ్ స్వల్పంగా పెరిగింది. పట్టణ మార్కెట్లతో పోల్చితే గ్రామీణ మార్కెట్లే మెరుగ్గా ఉన్నాయి. ముఖ్యంగా ద్రవ్యోల్బణం పెరుగుదల, మార్కెట్లలో మార్పుల వల్ల చిన్న సంస్థలు, అన్‌బ్రాండెడ్ సంస్థలు రెండంకెల వృద్ధిని నమోదు చేశాయి. ఏడాదికేడాదితో పోల్చితే గడిచిన మార్చి త్రైమాసికంలో అహార వినియోగ వృద్ధి 6 శాతం నుంచి 4.9 శాతానికి పడిపోయింది. గృహ, వ్యక్తిగత సంరక్షణ విభాగం అమ్మకాల్లో 5.7 శాతం పెరుగుదల చోటు చేసకుంది. అయితే.. గతేడాది మార్చి త్రైమాసికంలో 10.8 శాతం వృద్ధితో పోల్చితే చాలా తక్కువ." అని నీల్సన్ఐక్యూ రిపోర్ట్ పేర్కొంది.



## మేము జోక్యం చేసుకోం



న్యూయార్క్ : భారత్, పాక్‌ల మధ్య ఉద్రిక్తతలు పెచ్చరిల్లుతున్న తరుణంలో ఆ విషయంలో తాము జోక్యం చేసుకోవాలనుకోవడం లేదని అమెరికా పేర్కొంది. ప్రాథమికంగా అది తమ పని కాదని వ్యాఖ్యానించింది. గురువారం ఒక టివి ఇంటర్వ్యూలో అమెరికా ఉపాధ్యక్షులు జెడి వాన్స్ ఈ మేరకు వ్యాఖ్యలు చేశారు. భారత్, పాకిస్తాన్‌లను అమెరికా నియంత్రించలేదన్నారు. అయితే ఆ రెండు దేశాలు ఉద్రిక్తతలను తగ్గించుకునేలా తాము ప్రోత్సహించగలమని చెప్పుకొచ్చారు. అణ్వాయుధ దేశాలు ఎప్పుడైనా ఢ కొంటే, ప్రధాన ఘర్షణగా మారితే తాము కూడా ఆందోళన చెందుతామని చెప్పారు. సాధ్యమైనంత త్వరగా ఇరు దేశాల మధ్య ఉద్రిక్తతలు చల్లారాలని అమెరికా కోరుకుంటోందని, ఈ మేరకు అధ్యక్షులు డొనాల్డ్ ట్రంప్, విదేశాంగ మంత్రి మార్క్ రూబియో చేసిన ప్రకటనలను వాన్స్ ఉదహరించారు. దౌత్యపరమైన మార్గాల ద్వారా ఈ ప్రయత్నం చేయాలని ఆయన కోరారు.

# సెమీస్‌కు ఆయుశ్, ఉన్నతి

తైపీ ఓపెన్ సూపర్-300 బ్యాడ్మింటన్ టోర్నీ సెమీఫైనల్లోకి ఆయుశ్ శెట్టి, ఉన్నతి హుడా దూసుకెళ్లారు. శుక్రవారం జరిగిన పురుషుల సింగిల్స్‌లో ఆయుశ్ శెట్టి 16-21, 21-19, 21-14తో బి.యంగ్(కెనడా)పై చెమటోడ్చి నెగ్గాడు. ముఖ్యంగా రెండో గేమ్‌లో ఇరువురు షట్లర్లు ప్రతి పాయింట్ కోసం పోరాడారు. ఆ సెట్‌లో ఆయుశ్ చేజిక్కించుకొని.. మూడో గేమ్‌లో యంగ్‌కు ఆయుశ్ ముచ్చెమటలు పట్టించి ఆ గేమ్‌ను సునాయాసంగా చేజిక్కించుకున్నాడు. ఇక మహిళల సింగిల్స్‌లో ఉన్నతి ఉన్నతి హుడా కూడా సంచలనం నమోదు చేసింది. తనకంటే మెరుగైన ర్యాంక్‌లో ఉన్న తైపీకి చెందిన వై.యంగ్‌పై మూడుసెట్ల హెూరాహెూరీ పోరులో చిత్తు చేసింది. ఉత్కంఠభరితంగా సాగిన ఆ గేమ్‌లో ఉన్నతి 21-8తో తొలి గేమ్‌ను చేజిక్కించుకొని.. రెండో గేమ్‌లో పోరాటాపోటీగా తలపడి 19-21తో ఆ సెట్‌ను కోల్పోయింది. ఇక నిర్ణయాత్మక మూడో గేమ్‌లో 21-19తో చేజిక్కించుకొని సెమీస్‌కు చేరింది. సెమీస్‌లో ఉన్నతి జపాన్‌కు చెందిన మియాజాకితో తలపడనుంది.



## త్రివిధ దళాలకు క్రీడాకారుల సంఘీభావం!

అపరేషన్ సిందూర్ తర్వాత భారత్‌పాకిస్థాన్ దేశాల మధ్య ఉద్రిక్త వాతావరణం నెలకొన్న సంగతి తెలిసిందే. ఇరు దేశాల మధ్య తీవ్ర యుద్ధం జరుగుతున్న నేపథ్యంలో భారత క్రీడాలోకం త్రివిధ దళాలకు మద్దతుగా నిలిచింది. దేశ ప్రజల సంరక్షణ కోసం శ్రమిస్తున్న భద్రత దళాలకు పలువురు క్రీడాకారులు మద్దతుగా నిలిచారు. సైన్యం సేవలను కొనియాడుతూ పలువురు స్టార్ క్రీడాకారులు సోషల్ మీడియా వేదికగా పోస్టులు పెట్టారు. తామంతా సైన్యం వెంటే ఉన్నట్టు తెలిపారు. దేశ రక్షణ కోసం ప్రాణాలను సయితం లెక్క పెట్టకుండా సరిహద్దుల్లో పోరాడుతున్న మన సైనికులకు సెల్యూట్ అంటూ కోహ్లి పోస్ట్ చేశాడు. క్లిష్ట సమయంలో అనుక్షణం దేశాన్ని కంటికి రెప్పలా కాపాడుతున్న మన సైనికులకు అందరు మద్దతుగా నిలవాలని, వారిలో కొత్త ధైర్యాన్ని నింపాలని కోరాడు. దేశ సంరక్షణలో భాగంగా మన సైన్యం తీసుకునే ప్రతీ నిర్ణయాన్ని తాను గౌరవిస్తానని టీమిండియా స్టార్ క్రికెటర్ రోహిత్ శర్మ పేర్కొన్నాడు. మన దేశ గౌరవాన్ని పెంచడంలో సైనికులు ఎప్పుడూ ముందుంటారని వారి సేవలను కొనియాడాడు. మీ ధైర్యం, క్రమశిక్షణ, త్యాగమే జాతికి బలమని భారత బ్యాడ్మింటన్ స్టార్ పి.వి.సింధు పేర్కొంది. ఆపరేషన్ సిందూర్ వంటి పరిస్థితుల వేళ మన త్రివర్ణ పతకాన్ని ఎగురవేసిన మీ ధైర్యాన్ని, నిస్వార్ధ సేవలను ఎల్లవేళలా గుర్తుంచుకుంటామని సింధు తెలిపింది. వీరేంద్ర సెహ్వాగ్, హర్భజన్ సింగ్, సౌరభ్ గంగూలీ, కైఫ్, అశ్విన్, యువరాజ్, ఇర్ఫాన్ పఠాన్ తదితర క్రికెటర్లు సయితం సైనికులకు సెల్యూట్ చేస్తూ పోస్టులు పెట్టారు.





## ఐపిఎల్ వాయిదా : బిసిసిఐ

ఇండియన్ ప్రిమియర్ లీగ్(ఐపిఎల్) సీజన్-18 వారం రోజులు వాయిదా పడింది. భారత్-పాకిస్థాన్ దేశాల మధ్య ఉద్రిక్త పరిస్థితుల నేపథ్యంలో టోర్నీ నిర్వహణకు సంబంధించి కీలక నిర్ణయం తీసుకున్నారు. ఐపిఎల్ మిగిలిన మ్యాచ్‌లను వారం రోజుల పాటు నిలిపివేస్తున్నట్లు నిర్వాహకులు శుక్రవారం ప్రకటించారు. 'ప్రస్తుత పరిస్థితుల్లో అనేక ఫ్రాంచైజీలు ఆటగాళ్ల భద్రతపై ఆందోళన వ్యక్తం చేశాయి. దీనిపై ఐపిఎల్ పాలక మండలిలో చర్చించాం. ప్రసారకర్తలు, స్పాన్సరర్లు, అభిమానుల అభిప్రాయాలను కూడా పరిగణనలోకి తీసుకున్నాం. మన సాయుధ బలగాల స్థైర్యం, సన్నద్ధతపై మాకు పూర్తి విశ్వాసం ఉన్నప్పటికీ.. అందరి అభిప్రాయాలను గౌరవించి ఈ నిర్ణయం తీసుకున్నాం' అని ఐపిఎల్ తమ 'ఎక్స్' ఖాతాలో రాసుకొచ్చింది. ఆటగాళ్ల భద్రత విషయంలో రాజీ పడకూడదనే ఉద్దేశంతో టోర్నీని కొంతకాలం వాయిదా వేసినట్లు బిసిసిఐ అధికారులు పేర్కొన్నారు. షెడ్యూల్ ప్రకారం శుక్రవారం లక్నో వేదికగా లక్నో-బెంగళూరు జట్ల మధ్య ఏకనా స్టేడియంలో మ్యాచ్ జరగాల్సి ఉంది. ధర్మశాల వేదికగా ఢిల్లీ-పంజాబ్ జట్ల మధ్య గురువారం జరగాల్సిన మ్యాచ్ కూడా అర్ధాంతరంగా నిలిపివేసిన విషయం తెలిసిందే. ఇక ఈ సీజన్‌లో ఇంకా 12 లీగ్ మ్యాచులు, రెండు క్వాలిఫయర్లు, ఒక ఎలిమినేటర్, మే 25న కోల్‌కతా వేదికగా ఫైనల్ మ్యాచ్ జరగాల్సి ఉన్నాయి. ఈ సీజన్‌లో ఇప్పటివరకు 57 లీగ్ మ్యాచ్‌లు పూర్తయ్యాయి. ఇంకా 16 మ్యాచ్‌లు జరగాల్సి ఉంది. ఐపిఎల్ టోర్నమెంట్‌ను వారంరోజులు వాయిదా వేయడాన్ని అన్ని ఫ్రాంచైజీలు మద్దతు తెలిపాయి. ఈ క్రమంలో సన్‌రైజర్స్ హైదరాబాద్ సహా పలు ఫ్రాంచైజీలు కీలక నిర్ణయం తీసుకున్నాయి. ఈ వారం రోజుల్లో జరిగే మ్యాచ్‌ల టికెట్ డబ్బులను వాపస్ ఇస్తామని ఆయా ఫ్రాంచైజీలు 'ఎక్స్' వేదికగా వెల్లడించాయి. మే 10న (శనివారం) ఉప్పల్ స్టేడియంలో కోల్‌కతా నైట్ రైడర్స్‌తో సన్‌రైజర్స్ హైదరాబాద్ తలపడాల్సి ఉంది. దీంతో ఆ మ్యాచ్ టికెట్లు కొన్నవాళ్లకు డబ్బులు రీఫండ్ చేస్తాం' అని ఆరెంజ్ ఆర్మీ తన పోస్ట్‌లో రాసుకొచ్చింది. అలాగే లక్నో-బెంగళూరు మధ్య లక్నోలోని ఏక్నా స్టేడియంలో శుక్రవారం జరగాల్సిన మ్యాచ్‌కు సంబంధించి తిరిగి ఇచ్చేస్తామని ఆ ఫ్రాంచైజీ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపింది.

## సరిహద్దుల్లో టెన్షన్ టెన్షన్

**అదనపు డిప్యూటీ కమిషనర్ తో పాటు ఐదుగురు మృతి**

భారత్-పాక్ సరిహద్దుల్లో టెన్షన్ టెన్షన్ వాతావరణం నెలకొంది. పాక్ (%×అ౨ జం౧ఝ౨%) యథేచ్ఛగా కాల్పుల విరమణకు తూట్లు పొడుస్తోంది. సరిహద్దుల్లో పాక్ డ్రోన్ల వర్షం కురుపిస్తోంది. భారత భద్రత బలగాలను పాక్ డ్రోన్ దాడులను సమర్థంగా తిప్పికొట్టాయి. జమ్ము కశ్మీర్‌లో పాక్ రేంజర్లు జరిపిన కాల్పుల్లో అదనపు డిప్యూటీ కమిషనర్ రాజ్ కుమార్ తాపతో మరో ఐదుగురు మృతి చెందినట్లు ఆర్మీ అధికారులు వెల్లడించారు. రాజ్ కుమారి నివసిస్తున్న ఇంటి(క్వార్టర్)పై షెల్ పడడంతో కన్నుమూశాడు. ఈ ఘటనలో మరో ఇద్దరు అధికారులు గాయపడ్డారు. క్షతగాత్రులను స్థానిక ఆస్పత్రికి తరలించారు. అధికారి మృతిపట్ల సిఎం ఒమర్ అబ్దుల్లా సంతాపం తెలిపారు. ఆయన కుటుంబానికి ప్రగాఢ సానుభూతి ప్రకటించారు. శ్రీనగర్ నుంచి ప్రారంభిస్తే గుజరాత్ వరకు పాక్ దాడులకు పాల్పడుతోంది. పఠాన్‌కోట్‌లో పేలుళ్ల శబ్దాలు మారుమోగుతుండడంతో స్థానికులు భయంతో వణికిపోతున్నారు. శనివారం ఉదయం ఐదు గంటల నుంచే భారీ పేలుళ్ల శబ్దాలు వినిపిస్తున్నాయి. పాక్ దాడులను భారత సైన్యం సమర్థవంతంగా తిప్పికొడుతోంది.





## రికర్వులో సెమీస్‌కు దీపిక, పార్థ్

ఆర్చరీ ప్రపంచకప్ స్టేజ్-2 వ్యక్తిగత విభాగాల్లో దీపిక కుమారి, పార్థ్ సలుంకే సెమీఫైనల్లోకి దూసుకెళ్లారు. శుక్రవారం జరిగిన మూడో రౌండ్ పోటీలో పార్థ్ మూడు సార్లు ఒలింపిక్ ఛాంపియన్ కొరియాకు చెందిన కిమ్-జె-డియాక్‌ను చిత్తుచేశాడు. తొలిరౌండ్‌లో ఏకంగా మాజీ ఒలింపిక్, ప్రస్తుత ప్రపంచ ఛాంపియన్ మాటే గజోజ్(టర్కీ)ను షూట్-ఆఫ్‌లో ఓడించిన పార్థ్%ొ% ఆదివారం జరిగే వ్యక్తిగత సెమీస్‌లో పార్థ్ కొరియాకే చెందిన పారిస్ ఒలింపిక్స్ ఛాంపియన్ కిమ్ పూజిన్‌తో తలపడతాడు. ఇక మహిళల సింగిల్స్ క్వార్టర్‌ఫైనల్లో దీపిక కుమారి పారిస్ ఒలింపిక్స్ టీమ్ రజత పతక విజేత, చైనాకు చెందిన లీ-జియామన్‌పై 6-2తో విజయం సాధించింది. ఆదివారం జరిగే ఫైనల్లో దీపిక కుమారి ప్రస్తుత ఒలింపిక్ ఛాంపియన్, కొరియాకు చెందిన లిమ్-సిహియోన్‌తో అమీ తుమీ తేల్చుకోనుంది. ఇక మిక్స్‌డ్ విభాగం సెమీఫైనల్లో అభిషేక్ వర్మ-మధుర ధమన్‌గోంకర్ 156-158పాయింట్ల తేడాతో బ్రిటన్ జంట చేతిలో ఓటమిపాలయ్యారు. శనివారం జరిగే కాంస్య పతక పోరులో వీరు మలేషియాకు చెందిన ఫాతిన్-మహ్మద్ జువైదితో తలపడ నున్నారు. ఇక కాంపౌండ్ టీమ్ ఫైనల్లో భారత పురుషుల, మహిళల జట్లు ఫైనల్లో మెక్సికో తలపడనున్నాయి.

## టెస్ట్ క్రికెట్ కోహ్లి గుడ్‌బై?



టీం ఇండియా రన్ మెషీన్, కింగ్ విరాట్ కోహ్లి ఫ్యాన్స్‌కి షాకింగ్ న్యూస్. టీం ఇండియా త్వరలో ఇంగ్లండ్ పర్యటనకు వెళ్లనున్న విషయం తెలిసిందే. అక్కడ అతిధ్య జట్టుతో భారత్ ఐదు టెస్ట్ మ్యాచ్‌లు ఆడనుంది. అయితే ఇప్పటికే భారత జట్టుకు ఓ షాక్ తగిలింది. ఈ సిరీస్‌కి ముందే టెస్ట్ క్రికెట్ నుంచి రిటైర్ అవుతున్నట్లు హిట్‌మ్యాన్ రోహిత్ శర్మ ప్రకటించాడు. తాజాగా కింగ్ విరాట్ కోహ్లి కూడా టెస్ట్‌ల నుంచి రిటైర్ అవ్వాలనే యోచనలో ఉన్నట్లు క్రికెట్ వర్గాల్లో వార్తలు వినిపిస్తున్నాయి. ఈ విషయాన్ని అతను బిసిసిఐతో చెప్పినట్లు సమాచారం. ఇంగ్లండ్ పర్యటన భారత జట్టుకు ఎంతో ప్రతిష్టాత్మకమైనది. ఇప్పటికే రోహిత్ శర్మ రిటైర్ అవ్వడం జట్టుపై తీవ్ర ప్రభావం చూపిస్తుంది. ఇప్పుడు విరాట్ కోహ్లి కూడా టెస్ట్ క్రికెట్ నుంచి రిటైర్ అయితే జట్టు మిడిలార్డర్ చాలా బలహీనం అవుతుంది. దీంతో విరాట్ రిటైర్‌మెంట్ నిర్ణయం గురించి పునరాలోచించుకోవాలని బిసిసిఐ అతన్ని కోరినట్లు తెలుస్తోంది. అయితే దీనిపై ఎలాంటి అధికారిక ప్రకటన లేదు. మరి కోహ్లి తన నిర్ణయాన్ని మార్చుకుంటాడో.. లేదో వేచి చూడాల్సిందే.

## భయాందోళనలో విదేశీ క్రికెటర్లు?

భారత్‌పాకిస్థాన్ దేశాల మధ్య ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్న నేపథ్యంలో ఐపిఎల్‌లో వివిధ జట్లకు ప్రాతినిథ్యం వహిస్తున్న విదేశీ క్రికెటర్లలో ఆందోళన నెలకొంది. దేశంలో నెలకొన్న ఉద్రిక్త పరిస్థితులను దృష్టిలో పెట్టుకుని బిసిసిఐ ఇప్పటికే ఐపిఎల్‌ను వారం రోజుల పాటు వాయిదా వేసింది. ఇదిలావుంటే ఐపిఎల్‌లో ఆడేందుకు భారత్‌కు వచ్చిన విదేశీ క్రికెటర్లలో భయం వాతావరణం ఏర్పడింది. ఎప్పుడూ ఏ జరుతుందోనని భయపడుతున్నారు. ఈ సీజన్‌లో ఆస్ట్రేలియాకు చెందని ఎక్కువ మంది క్రికెటర్లు వివిధ జట్ల తరుపున ఆడుతున్నారు. ప్యాట్ కమిన్స్, హాజిల్‌వుడ్, ఆడమ్ జంపా, టిమ్ డేవిడ్, ట్రావిస్ హెడ్, స్టార్క్, స్టోయినిస్ తదితర ఆస్ట్రేలియా ఆటగాళ్లు వివిధ జట్లకు ప్రాతినిథ్యం వహిస్తున్నారు. అంతేగాక ఇంగ్లండ్, సౌతాఫ్రికా, వెస్టిండీస్, బంగ్లాదేశ్, అఫ్గానిస్థాన్, శ్రీలంక దేశాలకు చెందిన క్రికెటర్లు కూడా ఐపిఎల్‌లో ఆడుతున్నారు. ప్రస్తుతం వీరందరిలో భయం నెలకొంది. సాధ్యమైనంత త్వరగా స్వదేశానికి వెళ్లి పోవాలనే ఆలోచనలో వీరున్నట్టు తెలుస్తోంది. కాగా, బిసిసిఐ టోర్నమెంట్‌ను వారం రోజుల పాటు వాయిదా వేసిన నేపథ్యంలో విదేశీ క్రికెటర్లు తమ తమ దేశాలకు వెళ్లిపోతారా లేకుంటే భారత్‌లోనే ఉంటారా అనే దానిపై స్పష్టత రావడం లేదు.



## కొత్త కబుర్లు పంచుకున్న న్యాచురల్ స్టార్




హిట్ 3 ది థర్డ్ కేస్ మొదటి వారంలోనే వంద కోట్ల గ్రాస్ దాటేసి విజయవంతంగా రెండో వారంలోకి అడుగు పెట్టేసింది. ఇండో పాక్ సరిహద్దుల్లో ఏర్పడిన యుద్ధ వాతావరణం వల్ల సినీ సెలబ్రిటీలు వీలైనంత ఈవెంట్లు లేకుండా చూసుకుంటున్నారు కానీ న్యాచురల్ స్టార్ నాని ఈ రోజు హిట్ 3 సక్సెస్ మీట్ పెట్టి ఇలా చేయడం వెనుక ఉద్దేశంతో పాటు కొత్త కబుర్లు పంచుకున్నాడు. పాకిస్థాన్ కు చాలా పద్ధతిగా ఇండియన్ ఆర్మీ బుద్ధి చెబుతోందని, శత్రుదేశం వల్ల ఒక భారతీయ సినిమా సెలబ్రేషన్ చేయలేదనే కారణం వాళ్లకు ఇవ్వకూడదనే ఉద్దేశంతోనే టీమ్ అందరితో డిస్కస్ చేసి ఇది ఏర్పాటు చేసినట్టు వివరించాడు. ఇక విశేషాల వైపు చూస్తే హిట్ 4లో ఏసిపి వీరప్పన్ గా చేయబోతున్న కార్తీతో ఏదో పెద్దదే ప్లాన్ చేస్తున్నాడు నాని. ఇంకా సినిమా చూడాల్సిన వాళ్ళు చాలా ఉన్నారు కాబట్టి ఎక్కువ డీటెయిల్స్ రివీల్ చేయలేదు. మిక్కీ జె మేయర్ ని తీసుకోవడం గురించి కామెంట్స్ వచ్చాయని, ఇలాంటి క్రైమ్ థ్రిల్లర్స్ కి అతను ఎలా న్యాయం చేస్తాడని అన్నారని, కానీ ఇలాంటి వాటికి గతంలో పని చేసిన వాళ్ళను కాకుండా ఒక ఫ్రెష్ సౌండ్ కోసం మిక్కీని తీసుకొచ్చామని, అదిప్పుడు మంచి ఫలితాన్ని ఇచ్చిందని ఆనందం వ్యక్తం చేశాడు. శైలేష్ కొలనుతో కామెడీ సినిమా ఉండొచ్చని, కాకపోతే ఎప్పుడనేది చెప్పలేనని అన్నాడు. ఈ వీకెండ్ కి హిట్ 3కి కీలకం కానుంది. కొత్త రిలీజులు సింగిల్, శుభంకు డీసెంట్ టాక్ వచ్చినప్పటికీ అవి మాస్ ని టార్గెట్ చేసినవి కాకపోవడంతో నానికి మరో ఛాన్స్ దక్కింది. ఎలాగూ ఆడియన్స్ కి ఎక్కువ ఆప్షన్స్ లేవు. బుకింగ్స్ మళ్ళీ ఊపందుకున్న వైనం బుక్ మై షోలో కనిపిస్తోంది. దీన్ని ఇంకాస్త బలంగా పుష్ చేసే ఉద్దేశంతో నాని విజయోత్సవం చేసుకున్నాడు.

## వైవీఎస్.. మళ్లీ వచ్చారు



టాలీవుడ్లో ఒకప్పుడు మాంచి క్రేజ్ సంపాదించుకున్న దర్శకుల్లో వైవీఎస్ చౌదరి ఒకరు. లాహిరి లాహిరి లాహిరిలో, సీతయ్య, దేవదాసు చిత్రాలతో ఒక దశలో ఆయన ఊపుమీదున్నారు. కానీ ‘ఒక్క మగాడు’ తర్వాత ఆయన కెరీర్ తిరగబడింది. దాంతో మొదలుకుని వరుసగా డిజాస్టర్లు ఇచ్చి అడ్రస్ లేకుండా పోయారు. ‘రేయ్’ తర్వాత చాలా ఏళ్ల పాటు చౌదరి కనిపించలేదు. ఇక మళ్లీ ఆయన ఓ సినిమా చేయడం కష్టమే అనుకున్నారంతా. కానీ గత ఏడాది నందమూరి జానకిరామ్ తనయుడు కొత్త ఎన్టీఆర్‌ను హీరోగా పరిచయం చేయబోతున్నట్లు ప్రకటించి మళ్లీ వార్తల్లోకి వచ్చారు. రెండు మూడు నెలల పాటు ఈ సినిమా గురించి వరుసగా అప్‌డేట్స్ ఇస్తూ బాగానే హంగామా చేశారు చౌదరి. హీరోగా పరిచయమవుతున్న ఎన్టీఆర్, హీరోయిన్‌గా ఎంట్రీ ఇస్తున్న వీణారావులకు సంబంధించి ఇంట్రో వీడియోలు ఆకట్టుకున్నాయి. కీరవాణి, చంద్రబోస్, సాయిమాధవ్ బుర్రా లాంటి టాప్ టెక్నీషియన్లను ఈ సినిమాకు ఎంచుకున్నారాయన. ఐతే ఇలా వరుసగా అప్‌డేట్స్ ఇస్తూ తన రీఎంట్రీ మూవీని వార్తల్లో నిలబెట్టిన చౌదరి.. ఆ తర్వాత ఉన్నట్లుండి సైలెంట్ అయిపోయారు. ఈ సినిమా ఎప్పుడు మొదలవుతుందో చెప్పలేదు. షూటింగ్, రిలీజ్ గురించి అప్‌డేట్స్ లేవు. సైలెంటుగా షూటింగ్ చేస్తున్నారా అన్న దానిపైనా స్పష్టత లేదు. దీంతో సినిమా ముందుకు కదులుతుందా.. ఆగిపోతుందా అన్న సందేహాలు కలిగాయి. ఐతే ఎట్టకేలకు చౌదరి కొత్త అప్‌డేట్‌తో రెడీ అయ్యారు. మే 12న ఈ సినిమా ప్రారంభోత్సవాన్ని ఘనంగా నిర్వహించబోతున్నారు. ఇందుకోసం ఒక విశిష్ఠ అతిథిని తీసుకొస్తున్నారు.

## మహాభారతం పేరుతో మార్కెటింగ్ చేస్తున్నారా



ఈ మధ్య అమీర్ ఖాన్ ఇంటర్వ్యూలలో మహాభారతం ప్రస్తావన ఎక్కువగా వస్తోంది. ఇది తన డ్రీం ప్రాజెక్ట్ అంటూ త్వరలోనే స్క్రిప్ట్ పనులు మొదలు పెడతానంటూ పదే పదే చెప్పుకోవడం మీడియాలో హైలైట్ అవుతోంది. ముందు కర్ణుడి పాత్రను ఆధారంగా చేసుకుని దాన్ని హైలైట్ చేస్తామని అన్నారు. తాజాగా కృష్ణుడి క్యారెక్టర్ తనకు ఎంతో ఇష్టమని, ఎంతో స్ఫూర్తినిస్తుందని మరో చోట చెప్పారు. ఇలా తరచు మాటలు మారుస్తున్న అమీర్ భాయ్ నిజంగా అంత గ్రాండ్ స్కేల్ మీద భారతాన్ని తెరకెక్కిస్తాడా అనేది వేయి డాలర్ల ప్రశ్న. కొంచెం లోతుగా ఆలోచిస్తే ఇతరత్రా కారణాలు కనిపిస్తున్నాయి. జూన్ 20 విడుదల కాబోతున్న సితారే జమీన్ పర్ మీద అమీర్ ఖాన్ కు బోలెడు ఆశలున్నాయి. తన పూర్వ వైభవాన్ని తీసుకొచ్చే సినిమా అవుతుందని గంపెడు నమ్మకంతో ఉన్నాడు. ఆర్ఎస్ ప్రసన్న దర్శకత్వం వహించిన ఈ యూత్ ఎమోషనల్ ఎంటర్ టైనర్ కి మంచి బజ్ ఉంది కానీ మరీ భీభత్సంగా అయితే లేదు. లాల్ సింగ్ చద్దా కొట్టిన దెబ్బకు అమీర్ ఇమేజ్ ప్లస్ మార్కెట్ లెక్కల్లో కొన్ని మార్పులు వచ్చాయి. అందులోనూ సితారే జమీన్ పర్ మాస్ ఆడియన్స్ ని ఆకర్షించే కమర్షియల్ సబ్జెక్టు కాదు. సో ఓపెనింగ్స్ తో మొదలుపెట్టి టాక్ దాకా ఎన్నో అంశాలు బాక్సాఫీస్ రన్ ని ప్రభావితం చేయబోతున్నాయి. ఇదంతా దృష్టిలో పెట్టుకునే మహాభారతం టాపిక్ తీసుకురావడం ద్వారా జనాల అటెన్షన్ తనమీదకు వచ్చేలా అమీర్ ఖాన్ చేసుకుంటున్నాడనేది ఒక బాలీవుడ్ వర్గం విశ్లేషణ. దీన్ని పూర్తిగా కొట్టిపారేయలేం.

## అత్తరు సాయిబు బయటకు వచ్చాడు

ఒక హిట్టు లేదా ఫ్లాపుని బట్టి డైరెక్టర్ సత్తాని అంచనా వేయలేం కానీ ఇప్పుడున్న పరిస్థితుల్లో హీరోలు ఇలాంటి విషయాల్లో ఒకటికి పదిసార్లు అలోచించి నిర్ణయాలు తీసుకుంటున్నారు. మంచు మనోజ్ దర్శకుడు శేఖర్ రెడ్డికి గ్రీన్ సిగ్నల్ ఇచ్చారనే వార్త అభిమానుల మధ్య చర్చకు దారి తెస్తోంది. కారణం అతను తీసిన రెండు సినిమాలు ఆడకపోవడమే. ఆరెక్స్ 100 ఫేమ్ కార్తికేయతో పెద్ద బడ్జెట్ పెట్టి 90 ఎంఎల్ తీస్తే ఫలితం దక్కలేదు. చిన్న పిల్లలను ప్రధాన పాత్రల్లో పెట్టి తీసిన హౌస్ అరెస్ట్ అసలు వచ్చిన సంగతే ఎవరికీ తెలియనంతగా ఫ్లాపయ్యింది. హనుమాన్ కన్నా ముందు నిర్మాత నిరంజన్ రెడ్డి తీసిన మూవీ ఇది. ఇప్పుడీ శేఖర్ రెడ్డికే మంచు మనోజ్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్టుగా తెలిసింది. అత్తరు సాయిబు టైటిల్ ని దాదాపుగా లాక్ చేశారట. మే 20 మనోజ్ పుట్టినరోజు సందర్భంగా దీన్ని లాంచ్ చేయాలనే ప్లానింగ్ జరుగుతోంది. సెలబ్రేషన్స్ గ్రాండ్ గా ఉండేలా చూస్తున్నారని తెలిసింది. ప్రాజెక్ట్ కన్ఫర్మని, ఫైనల్ నెరేషన్ ఈ వారంలోనే పూర్తయ్యాక అప్పుడు మీడియాకు చెప్పే ఆలోచనలో ఉన్నారట. ఈలోగా లీక్ రూపంలో బయటికి వచ్చేసింది. ఫుల్ ఎంటర్ టైనర్ గా రూపొందే అత్తరు సాయిబులో మనోజ్ బాడీ లాంగ్వేజ్, మ్యానరిజం డిఫరెంట్ గా ఉంటాయని అంటున్నారు. కామెడీ ప్రధానంగా ట్రీట్ మెంట్ ఉంటుందని టాక్. వ్యక్తిగత సమస్యలు ఎన్ని ఉన్నా మనోజ్ వేగంగా సినిమాలు చేయాలని ఫ్యాన్స్ కోరుతున్నారు. భైరవం రిలీజ్ కు రెడీగా ఉంది. తేజ సజ్జ మిరాయ్ లో విలన్ గా నటించడం కొత్త బ్రేక్ ఇస్తుందని ఇప్పటికే టాక్ ఉంది.




## కృష్ణవంశీ ఫటాఫట్ ఆన్సర్స్

టాలీవుడ్ లెజెండరీ డైరెక్టర్లలో ఒకడైన కృష్ణవంశీ.. సోషల్ మీడియాలో చాలా యాక్టివ్ అన్న సంగతి తెలిసిందే. ఆయన తరం దర్శకుల్లో ట్విటర్ వాడేవాళ్లు తక్కువ. తర్వాతి తరం దర్శకులు ట్విట్టర్లో ఉన్నా అంత యాక్టివ్‌గా ఉండరు. కానీ కృష్ణవంశీ మాత్రం అభిమానులతో తరచుగా చిట్ చాట్లు చేస్తుంటారు. ఎవరైనా తనను ట్యాగ్ చేసి తన సినిమాల గురించి కామెంట్స్ చేసినా స్పందిస్తుంటారు. అనామకులకు, హార్ష్ కామెంట్లు చేసే వారికి కూడా ఆయన పద్ధతిగా సమాధానం ఇస్తుంటారు. తాజాగా కృష్ణవంశీ.. ట్విట్టర్ ఫ్యాన్స్‌తో చిట్ చాట్ చేశారు. అందులో వాళ్లు అడిగిన ప్రశ్నలకు ఫటాఫట్ ఆన్సర్లు ఇచ్చారు. ఎంతో ఆసక్తికరంగా సాగిన ఆయన చిట్ చాట్ విశేషాలు ఓసారి చూద్దాం. కృష్ణవంశీ కెరీర్లో ‘ఖడ్గం’ చాలా స్పెషల్ ఫిలిం. దానికి సీక్వెల్ తీస్తారా అని ఓ అభిమాని అడిగితే.. “లేదండీ. అది సాధ్యం కాదు. క్షమించండి” అనేశారు కృష్ణవంశీ. ఆయన సీక్వెల్స్, రీమేక్, ఫ్రాంఛైజీ సినిమాలకు పూర్తి వ్యతిరేకమని ఎప్పటికప్పుడు చెబుతూనే ఉంటారు. ఐతే మీరు రీమేక్ చేయాల్సి వ్తే ‘నిన్నే పెళ్ళాడుతా’ను నాగచైతన్యతో రీమేక్ చేస్తారా అని.. అలాగే నాగచైతన్య-ఎన్టీఆర్‌లతో ‘గుండమ్మ కథ’ తీస్తారా అని అడిగితే.. “మంచి ఆలోచనే. 150 కోట్లు తీసుకుని వచ్చేయండి. దుల్లకొట్టేద్దాం” అంటూ షార్ప్‌గా కామెంట్ చేశారు కృష్ణవంశీ. మరోవైపు చిరంజీవితో ఎప్పట్నుంచో చేయాలనుకుంటున్న సినిమా సంగతి ఏమైంది అని అడిగితే.. “నాకు ఆ కోరిక ఉంది. ఎప్పట్నుంచో ఆయన్ని అడుగుతున్నాను. కానీ ఎందుకో కుదరడం లేదు. నా బ్యాడ్ లక్. ఐతే చిరంజీవితో ‘రుద్రవీణ’ లాంటి సినిమా తీసే సీన్ మాత్రం నాకు లేదు” అని బదులిచ్చారు. చిరుతో ఆపద్బాంధవుడు లాంటి సినిమా తీయమని ఒక నెటిజన్ అడిగితే.. ఆ మాట చిరుకు మీరే చెప్పాలన్నారు కృష్ణవంశీ. జూనియర్ ఎన్టీఆర్‌తో ‘రైతు’ సినిమా ప్రపోజల్ ఏమైంది అని అడిగితే.. “ఆయన ఇప్పుడు జూనియర్ కాదండీ. ఇంటర్నేషనల్ రేంజ్. నేను ఆయనతో సరిపోను” అన్నారు.



## మీనమేషాలు లెక్కబెడుతున్న స్టారర్

చెప్పుకోదగ్గ క్యాస్టింగ్ ఉంది. విడుదల తేదీ ప్రకటిస్తే బిజినెస్ జరిగిపోతుంది. కానీ భైరవం టీమ్ మీనమేషాలు లెక్కబెడుతున్న తీరు ఆశ్చర్యం కలిగిస్తోంది. బెల్లంకొండ సాయిశ్రీనివాస్, మంచు మనోజ్, నారా రోహిత్ కలయికలో రూపొందిన ఈ విలేజ్ డ్రామాని మరీ ఆర్ఆర్ఆర్ రేంజ్ లో మల్టీస్టారర్ అనలేం కానీ మినీ స్టారరని చెప్పొచ్చు. ఆల్రెడీ ఒక పాట చార్ట్ బస్టర్ అయ్యింది. పోస్టర్లు, టీజర్ జనంలో ఆసక్తిని పెంచాయి. తమిళ సూపర్ హిట్ గరుడన్ రీమేక్ గా రూపొందిన భైరవంకు నాంది ఫేమ్ విజయ్ కనకమేడల దర్శకత్వం వహించారు. శంకర్ కూతురు అదితి శంకర్ టాలీవుడ్ కు హీరోయిన్ గా పరిచయమవుతోంది. అన్నీ బాగానే ఉన్నా ఎలాంటి చప్పుడు చేయకుండా భైరవం ఇంత మౌనంగా ఎందుకు ఉందనే సందేహం రావడం సహజం. మంచు విష్ణుతో ఉన్న విభేదాల దృష్ట్యా కన్నప్పకు పోటీగా ఈ సినిమాని రిలీజ్ చేయాలని మనోజ్ పట్టుబడుతున్నట్టుగా ఒక వెర్షన్ ఉంది. అదే నిజమైతే జూన్ 27 అని ప్రకటించేయాలి. కానీ అలా జరగలేదు. వాస్తవమేంటో టీమ్ కే తెలుసు. ఇంకో వైపు ఓటిటి డీల్ ఎంతకీ తెగకపోవడం వల్లే నిర్మాత డేట్ వేయలేకపోతున్నారని ఇన్ సైడ్ టాక్. ఆశించిన దానికన్నా తక్కువ మొత్తం ఆఫర్ చేయడం వల్ల వేచి చూసే ధోరణిలో ఉన్నట్టు చెబుతున్నారు. ఇప్పటికే డిలే వల్ల బజ్ తగ్గడం మొదలయ్యింది. చూస్తుంటే మేలో రావడం దాదాపు అసాధ్యమే. వచ్చే వారం స్లాట్ ఖాళీగా ఉన్నా భైరవం యూనిట్ నుంచి ఎలాంటి సౌండ్ లేదు. నెలాఖరులో 30న విజయ్ దేవరకొండ కింగ్ డమ్ ఉంది. ప్రస్తుతానికి వీళ్ళు అదే తేదీకి కట్టుబడ్డారు. ఒకవేళ పవన్ కళ్యాణ్ హరిహర వీరమల్లు వస్తే వాయిదా పడొచ్చు. అది కూడా ఇంకా తేలలేదు. జూన్ 20 కుబేర, సితారే జమీన్ పర్ ఉన్నాయి. ఆపై వారం 27 కన్నప్ప దిగుతాడు. అటుపై జూలైలో ఇంకా కష్టం. ఇంత స్పష్టంగా సమీకరణాలు కనిపిస్తుంటే భైరవం ఇంకా విడుదల తేదీ దోబూచులాడటం గమనార్హం. ఎక్కువ ఆలస్యం చేసినా ఉన్న బజ్ తగ్గిపోయే ప్రమాదముంది.



## ‘థగ్‌లైఫ్’ ఆడియో వేడుక వాయిదా

కథానాయకుడు కమల్‌హాసన్ ప్రధాన పాత్రలో ప్రముఖ దర్శకుడు మణిరత్నం తెరకెక్కిస్తున్న చిత్రం ‘థగ్‌లైఫ్’. ఈనెల 16న ఈ సినిమా ఆడియో వేడుక చెన్నైలో జరగాల్సివుంది. భారత్-పాకిస్తాన్ ఉద్రిక్తతల నేపథ్యంలో ఈ కార్యక్రమాన్ని వాయిదా వేస్తున్నట్లు కమల్‌హాసన్ ప్రకటించారు. సరిహద్దుల్లో ఉద్రిక్తతల నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఆయన తెలిపారు. ‘ఆర్ట్ కెన్ వెయిట్%ా% ఇండియా కమ్స్ ఫస్ట్’ అనే శీర్షికతో ఒక ప్రకటన విడుదల చేశారు. ‘మన దేశ సరిహద్దులో జరుగుతున్న పరిణామాలు, ప్రస్తుత పరిస్థితుల దృష్ట్యా మే 16న జరగాల్సిన ‘థగ్‌లైఫ్’ ఆడియో విడుదలను వాయిదా వేస్తున్నాం. తిరిగి షెడ్యూల్ వివరాలను తెలుపుతాం. మన సైనికలు మన మాతృభూమి పరిరక్షణలో అంచంచలమైన ధైర్యంతో ముందు వరుసలో ఉండి పోరాటం చేస్తున్నారు. ఇది నిశ్శబ్ద సంఘీభావం కోసం నిర్ణయం తీసుకుంటున్నాం. వేడుకలకు ఇది సరైన సమయం కాదని నేను నమ్ముతున్నా. కొత్త తేదీని త్వరలో ప్రకటిస్తాం’ అని ఆయన పేర్కొన్నారు. ‘నాయగన్’ (1987) వంటి హిట్ మూవీ తర్వాత 38 సంవత్సరాలకు మళ్లీ కమల్‌హాసన్-మణిరత్నం కాంబినేషన్‌లో ‘థగ్‌లైప్’ సినిమా రానుంది. శింబు, త్రిష, అశోక్ సెల్వన్, ఐశ్వర్యాలక్ష్మి, జోజు జార్జ్, అభిరామి, నాజర్ ప్రధాన పాత్రల్లో నటించారు. ఉదయనిధి స్టాలిన్, ఆర్.మహేంద్రన్‌బీ శివ అనంత్ భారీ బడ్జెట్‌తో నిర్మించిన నిర్మించిన ఈ సినిమా జూన్ 5న విడుదల కానుంది. ఎఆర్ రెహమాన్ సంగీత దర్శకుడిగా, రవి కె చంద్రన్ ఛాయాగ్రాహకుడిగా వ్యవహరిస్తున్నారు.

HEAD OFFICE FLAT NO 101 2ND FLOOR SADGURU APTS BEHIND BAZAR THARANKA SEC BAD 500017,
HYDERABAD TELANGANA STATE OFFICE
PHONE NAMBER 9603437744, 7729045143,9441015254,7893948284 EMAIL : JAIBHEEMTVINDIA@GMAIL. COM, WEBSITE: WWW.JAIBHEE,TV.COM